www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -165 గురువారం 1 అక్టోబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# ‘సిరిసిల్ల గడీ’ని కూలుస్తాం.

## కేటీఆర్‌పై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు





సిరిసిల్లకు రూ.1,500 కోట్ల కేటాయింపు

కాంగ్రెస్ నేతకు మంత్రి పదవి హామీ

బతుకమ్మ చీరలపై కమీషన్ల ఆరోపణలు

దళితుల అంశంలో బీఆర్ఎస్‌పై విమర్శలు

**సిరిసిల్ల సెప్టెంబర్ 30(ప్రజావినికిడి):**
సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ **మిగతా 2లో...**



# ఏపీలో సర్ గడువు పొడిగింపు..

అక్టోబర్ 10 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం

అక్టోబర్ 16న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

అర్హులైన ఏ ఒక్క ఓటరు మిగిలిపోకూడదనే ఈ నిర్ణయం

కొత్త తేదీలపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశం

**అమరావతి సెప్టెంబర్ 30 (ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమ గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, తుది ఓటర్ల జాబితాను 2026 అక్టోబర్ 16న ప్రచురించనున్నారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ అక్టోబర్ 9న **మిగతా 2లో...**

# బ్యాలెట్ పేపర్ విధానం అమలు చేయాలి

## ‘ఇండియా’ కూటమి 6 కీలక డిమాండ్లు




పాత ఓటర్ల జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని డిమాండ్

ఓటర్ల జాబితా మార్పుల్లో పూర్తి పారదర్శకత ఉండాలని సూచన

ఓటరు తొలగింపుపై కారణాలు, అప్పీల్ అవకాశం కల్పించాలని డిమాండ్

ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ విధానం అమలు చేయాలన్న ‘ఇండియా’ కూటమి

ఈసీపై అన్ని రాజకీయ పక్షాలకు విశ్వాసం కలగాలని వ్యాఖ్య

**ఢిల్లీ సెప్టెంబర్ 30(ప్రజావినికిడి):**
ఎన్నికల సంఘం (ఈసీ) వ్యవహరిస్తున్న తీరుపై ఇండియా కూటమి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈసీ వైఖరికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టేందుకు కూటమి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరు ప్రధాన డిమాండ్లను వెల్లడించారు. భవిష్యత్ ఎన్నికల్లో ‘స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్’ కు ముందు ఉన్న ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకోవాలని ఇండియా కూటమి **మిగతా 2లో...**



కాంగ్రెస్‌ను వీడిన వారంతా

# వెనక్కి రావాలి

జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలన్న మల్లు భట్టి

సీఎంతో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ

నేతలను కులం కోణంలో చూడకూడదని వ్యాఖ్య

గ్యారెంటీ పథకాలు ఉచితాలు కావన్న డిప్యూటీ సీఎం

**హైదరాబాద్ సెప్టెంబర్ 30 (ప్రజావినికిడి):**
వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. **మిగతా 2లో...**

# పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు

తెలుగు గడ్డపై పుట్టిన పార్టీ జాతీయ స్థాయికి ఎందుకు విస్తరించకూడదన్న కేటీఆర్

**హైదరాబాద్ సెప్టెంబర్ 30 (ప్రజావినికిడి):**
పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ వర్కింగ్ **మిగతా 2లో...**



# రబీ పంటల మద్దతు ధర పెంపు

రబీ పంటల ఎంఎస్‌పీ పెంపునకు కేంద్రం ఆమోదం

కుసుమకు అత్యధికంగా రూ.675 పెంపు

ఆవాలకు రూ.413, గోధుమకు రూ.25 చొప్పున పెంపు

3,715 లక్షల టన్నులకు పెరిగిన గోధుమ సేకరణ

ఆరు రబీ పంటలకు రూ.8.36 లక్షల కోట్ల మద్దతు ధర

**ఢిల్లీ సెప్టెంబర్ 30 (ప్రజావినికిడి):**
రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2027-28 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి అన్ని రబీ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)**మిగతా 2లో...**



# రాజస్థాన్‌తో ఒప్పందం రద్దు చేయండి

## సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు లేఖ

రాజస్థాన్‌కు 800 మెగావాట్ల విద్యుత్ కేటాయింపుపై తీవ్ర అభ్యంతరం

తెలంగాణ వనరులతో ఇతర రాష్ట్రాలకు విద్యుత్ ఇవ్వడమేంటని ప్రశ్న

రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలతో ఇబ్బంది పడుతున్నారని ఆరోపణ

**హైదరాబాద్ సెప్టెంబర్ 30 (ప్రజావినికిడి):**
మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి. హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. సింగరేణి నుంచి రాజస్థాన్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్ రంగ నిర్వహణలో విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. **మిగతా 2లో...**





# అదనపు డిక్లరేషన్ అవసరం లేదు

కొత్త ఓటర్లు ఇక తల్లిదండ్రులు, తాతలు, నానమ్మల ఓటరు జాబితా వివరాలు సమర్పించాల్సిన అవసరం లేదు. ఈ మేరకు ఫారం-6లో మార్పులు చేసింది. ఇప్పటివరకు కొత్త ఓటరు పేరు ఓటర్ల జాబితాలో చేర్చేందుకు సాధారణ ఫారం-6 సరిపోయేది. అయితే 'సర్' ప్రక్రియ సమయంలో ఫారం-6తో పాటు అదనపు డిక్లరేషన్ తీసుకున్నారు. గతంలో ఉన్న ఓటర్ల జాబితాతో తమ కుటుంబానికి ఉన్న సంబంధాన్ని నిర్ధారించేందుకు తల్లిదండ్రులు లేదా తాతల వివరాలు ఇవ్వాలని అందులో కోరారు.

'సర్' పూర్తయిన రాష్ట్రాల్లో ఇప్పుడు ఈ అదనపు డిక్లరేషన్ అవసరం ఉండదు. బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ పూర్తయిందని ఈసీ తెలిపింది. సర్ సమయంలో పేరు జాబితాలో లేని వారు, అలాగే కొత్తగా ఓటు హక్కు పొందిన యువత, తొలిసారి ఓటు వేయబోయే వారు నిరంతర అప్‌డేషన్ ప్రక్రియలో పేర్లు నమోదు చేసుకోవచ్చు. అయితే 'సర్' ఇంకా కొనసాగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం ఈ నిబంధన కొనసాగుతుంది. అక్కడ కొత్త ఓటర్లు ఫారం-6తో పాటు 'సర్'కు సంబంధించిన డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుంది. గత ఓటర్ల జాబితాతో తమ సంబంధాన్ని చూపించే వివరాలను కూడా ఇవ్వాలి.

ఫారం-6లో మార్పులపై ఈసీలో విభేదాలు ఉన్నట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అదనపు డిక్లరేషన్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఫారం-6, 'సర్'కు సంబంధించిన నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఏకగ్రీవ నిర్ణయాలేనని ఈసీ స్పష్టం చేసింది. సెప్టెంబర్ 26న విడుదల చేసిన వివరణలో సర్ డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని ఈసీ పేర్కొంది. సర్ పూర్తయిన ప్రాంతాల్లో, అలాగే ఇంకా ప్రారంభం కాని ప్రాంతాల్లో అదనపు డిక్లరేషన్ అవసరం లేదని తెలిపింది. తాజా మార్పుతో సర్ పూర్తయిన రాష్ట్రాల్లో కొత్త ఓటర్లు ఇక సాధారణ ఫారం-6 ద్వారానే నమోదు చేసుకోవచ్చు. అదనంగా కుటుంబానికి సంబంధించిన పాత ఓటర్ల జాబితా వివరాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదు.

# బ్యాలెట్ పేపర్ విధానం అమలు చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

కోరింది. ఓటర్ల జాబితాలో జరిగే ప్రతి మార్పుపై పూర్తి పారదర్శకత ఉండాలని చెప్పింది. నియోజకవర్గం, పోలింగ్ బూత్ వారీగా చేర్పులు, తొలగింపులు, సవరణల వివరాలను బహిరంగంగా ఉంచాలని డిమాండ్ చేసింది. ఓటరును జాబితా నుంచి తొలగించే ముందు కారణాలను తెలియజేయాలని కూటమి కోరింది. అలాంటి నిర్ణయంపై అప్పీల్ చేసుకునేందుకు సమర్థమైన విధానం ఉండాలని పేర్కొంది. పరిపాలనా లోపాలు, తగిన పత్రాలు లేకపోవడం, అవగాహన లేకపోవడం వంటి కారణాలతో అర్హులైన ఓటర్లు ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని కోరింది. ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని ఇండియా కూటమి డిమాండ్ చేసింది. యువత, తొలిసారి ఓటు వేయబోయే వారికి సులభంగా ఓటరు నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని కోరింది. ఎన్నికల వ్యవస్థలో సంస్థాగత జవాబుదారీతనం పెరగాలని ఖర్గే అన్నారు. అన్ని రాజకీయ పక్షాలకు విశ్వాసం కలిగించేలా ఎన్నికల సంఘం పనిచేయాలని డిమాండ్ చేశారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో 'ఓట్ల చోరీ' జరిగిందని రాహుల్ గాంధీ ఆధారాలతో చూపించారని ఖర్గే ఆరోపించారు. ఈ అంశంపై ఈసీ స్పందించలేదని అన్నారు. పారదర్శకత స్థానంలో రహస్య విధానం రాకూడదని, ఒక్క వ్యక్తికి ఒక ఓటు, ఓటుకు సమాన విలువ అనే సూత్రం బలహీనపడకూడదని ఇండియా కూటమి పేర్కొంది.

# పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు

**మొదటిపేజీ తరువాయి**

ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. "నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?" అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు.

తెలుగు సినిమాలు పాన్-ఇండియా స్థాయిలో విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే పార్టీ పేరు మార్చామని తెలిపారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఈసీ పనితీరుపై ఇటీవల ఓ జాతీయ మీడియా చేసిన పరిశోధనలో వెల్లడైన అంశాలు నిజమేనని చాలామంది నమ్ముతున్నారని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అయితే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

# యువతకు ఉద్యోగాలే తొలి లక్ష్యం

**కొచ్చి సెప్టెంబర్ 30(ప్రజావినికిడి):** ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకుందని లోకేశ్ తెలిపారు. విద్యా పాఠ్యాంశాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మారుస్తున్నామని, వివిధ రంగాల్లో పెట్టుబడులు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నామని చెప్పారు.

**జెన్-జీ మార్పు కోరుకుంటోంది**

కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా యువతలో కొత్త మార్పు కనిపిస్తోందని లోకేశ్ అన్నారు. వ్యవస్థలో మార్పులు రావాలని కోరుకుంటున్న యువత ఒక వర్గంగా ముందుకు వస్తోందని చెప్పారు. యువతతో కలిసి సమస్యలకు పరిష్కారాలు వెతకడం తనకు ఉత్సాహాన్నిస్తోందన్నారు.

**డీఎస్సీపై ఆరోపణలు.. సర్టిఫికెట్లపై క్లారిటీ**

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించామని లోకేశ్ తెలిపారు. క్రీడా కోటాలో ఎంపికైన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలే జారీ చేశారని చెప్పారు. ఈ అంశంపై కోర్టు, సీబీఐ దర్యాప్తు కోరినా.. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

**అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్**

క్వాంటమ్ టెక్నాలజీ ఊహ కాదని.. ఇది నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ అని లోకేశ్ అన్నారు. తొలి 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. పరిశోధనలు, మెటీరియల్ సైన్స్, క్రయోజెనిక్ టెక్నాలజీ వంటి రంగాల్లో పని చేస్తూ క్వాంటమ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలనుకుంటున్నామని చెప్పారు.

**విద్యా వ్యవస్థలో సమూల మార్పులు**

విద్యా వ్యవస్థ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మారాలని లోకేశ్ అన్నారు. గత రెండేళ్లలో 16 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని తెలిపారు. ఏఐ నుంచి క్వాంటమ్ వరకు భవిష్యత్ టెక్నాలజీలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలకు కనీసం దశాబ్ద కాలం పడుతుందని పేర్కొన్నారు.

**పెట్టుబడులకు '3ఎస్' మంత్రం**

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకొచ్చేందుకు స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే 3ఎస్ విధానాన్ని అనుసరిస్తున్నామని లోకేశ్ చెప్పారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వడం, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులకు తెలియజేయడం, ప్రభుత్వాలు మారినా విధానాల్లో స్థిరత్వం ఉండేలా చూడటం తమ విధానమన్నారు. వ్యవసాయం నుంచి క్వాంటమ్ వరకు 23 క్లస్టర్లలో పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

# 'సిరిసిల్ల గడీ'ని కూలుస్తాం..

**మొదటిపేజీ తరువాయి**

కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీని కూల్చుతామని చెప్పి చేసి చూపించామని, ఇప్పుడు సిరిసిల్ల గడీని కూడా నేలమట్టం చేద్దామని సిరిసిల్ల ప్రజలకు పిలుపునిచ్చారు. కేటీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తూ.. 'పిల్లకాకికి ఏం తెలుసు ఉండేలు దెబ్బ' అంటూ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తన విలువ ఏంటో ఫామ్‌హౌస్‌లో పడుకున్న వారి అయ్యను అడిగితే తెలుస్తుందని అన్నారు. గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని సీఎం తెలిపారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడిని భవిష్యత్తులో మంత్రిని చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతూ.. తాను సీఎం అయిన తర్వాత సీతక్క వంటి సామాన్యులకు మంత్రి పదవులు దక్కాయని పేర్కొన్నారు.



**బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లే**

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీఎం విమర్శించారు. టీవీలు, పేపర్లు, స్టార్ హోటళ్లు, ఫామ్‌హౌస్‌లు మాత్రమే సంపాదించుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ కలెక్టరేట్‌ను ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. టెండర్లు దక్కించుకుని కమీషన్లు తీసుకున్నారని, చివరకు బతుకమ్మ చీరల తయారీలోనూ కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'పుట్టింటి సారె' పేరుతో ఆడబిడ్డలకు నాణ్యమైన చీరలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తున్నామని చెప్పారు.

**దళితులపై చిన్నచూపా?**

అసెంబ్లీలో స్పీకర్‌ను దూషించి అవమానించిన ఘనత బీఆర్ఎస్ నాయకులదేనని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎర్రవల్లిలో దళితులు డప్పు కొడితే ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో కడిగి అణగదొక్కారని ఆరోపించారు. దళితులంటే బీఆర్ఎస్‌కు అంత చిన్నచూపా అని ప్రశ్నించారు.

ఎర్రవల్లి భూముల ఆక్రమణలతో పాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావుల అక్రమాస్తులపై లెక్కలు తేలుస్తున్నామని సీఎం అన్నారు. 'ఎట్ హోమ్', 'దక్కన్ స్టార్ హోటల్స్' పేరుతో ఉన్న ఆస్తులు వారి పేర్లకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అసెంబ్లీలో సమయం లేక కొన్ని విషయాలు చెప్పలేకపోయామని, త్వరలో 'పార్ట్-2'లో అన్ని వివరాలు బయటపెడతామని ప్రకటించారు.

# కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలి

**మొదటిపేజీ తరువాయి**

జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

# రబీ పంటల మద్దతు ధర పెంపు

**మొదటిపేజీ తరువాయి**

పెంచేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

రబీ పంటల్లో కుసుమ మద్దతు ధరను అత్యధికంగా క్వింటాల్‌పై రూ.675 పెంచారు. ఆ తర్వాత ఆవాలకు రూ.413 పెంపు ప్రకటించారు. మసూర్ పప్పుకు రూ.390, బార్లీకి రూ.136, శనగకు రూ.83, గోధుమకు రూ.25 చొప్పున ఎంఎస్‌పీ పెంచారు.

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా ఈ పెంపు చేసినట్లు కేంద్రం తెలిపింది. ఉత్పత్తి వ్యయంపై కనీసం 1.5 రెట్ల స్థాయిలో ఎంఎస్‌పీ ఉండేలా చూడాలన్న 2018-19 కేంద్ర బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

ఇటీవలి కాలంలో తృణధాన్యాలతో పాటు పప్పులు, నూనెగింజల సాగును ప్రోత్సహించేందుకు కేంద్రం ఎక్కువ మద్దతు ధర అందిస్తోంది. 2014-15 నుంచి 2025-26 మధ్య గోధుమల సేకరణ 3,715 లక్షల టన్నులకు పెరిగింది. 2004-05 నుంచి 2013-14 మధ్య ఇది 2,254 లక్షల టన్నులుగా ఉంది. ఆరు రబీ పంటల సేకరణ కూడా ఇదే కాలంలో 3,921 లక్షల టన్నులకు చేరింది. గతంలో ఇది 2,302 లక్షల టన్నులుగా ఉండేది. గోధుమ రైతులకు 2014-15 నుంచి 2025-26 మధ్య మద్దతు ధర రూపంలో రూ.7.31 లక్షల కోట్లు చెల్లించారు. 2004-05 నుంచి 2013-14 మధ్య చెల్లించిన రూ.2.56 లక్షల కోట్లతో పోలిస్తే ఇది ఎక్కువ. ఆరు రబీ పంటలు పండించే రైతులకు ఇదే కాలంలో రూ.8.36 లక్షల కోట్లు ఎంఎస్‌పీగా చెల్లించగా.. అంతకుముందు కాలంలో రూ.2.65 లక్షల కోట్లు చెల్లించారు.

# ఏపీలో సర్ గడువు పొడిగింపు..

**మొదటిపేజీ తరువాయి**

పూర్తి కావాల్సి ఉండగా, తాజాగా మరో వారం పాటు గడువు పెంచడం గమనార్హం.

కొత్త షెడ్యూల్ ప్రకారం, ఓటర్ల జాబితాపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార గడువును అక్టోబర్ 10 వరకు పొడిగించారు. ఈ గడువులోగా వచ్చిన అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఈసీ ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్న విచారణలు (హియరింగ్‌లు), ముఖ్యంగా నో-మ్యాపింగ్, లాజికల్ డిస్క్రిపెన్సీ కేసులు, ఫారం 6, 7, 8 దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో ఈ పొడిగింపు ఇచ్చినట్లు పేర్కొంది. కాగా, 2026 జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించిన విషయం తెలిసిందే. మారిన తేదీల వివరాలను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఈసీ అధికారులను సూచించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మేఘాలయ వంటి ఇతర రాష్ట్రాల్లో కూడా ఓటర్ల జాబితా సవరణ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది.

# రాజస్థాన్‌తో ఒప్పందం రద్దు చేయండి

మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణలో భాగంగా ఉత్పత్తి అయ్యే 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు చెందిన సంస్థకు కేటాయించడంపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు సింగరేణి గనుల నుంచి, నీరు గోదావరి నది నుంచి సేకరిస్తున్నారని, అలాగే భూమి కూడా తెలంగాణదేనని వ్యాఖ్యానించారు. రాష్ట్ర వనరులతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను మన అవసరాలకు వినియోగించకుండా వేరే రాష్ట్రానికి కేటాయించడంపై నిలదీశారు. తెలంగాణలో విద్యుత్ కోతలతో రైతుల పంటలు ఎండిపోతుంటే, రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ఇవ్వడానికి సిద్ధపడటం దారుణమని హరీశ్ రావు అన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు రైతులకు కనీసం 7-8 గంటలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని తన లేఖలో స్పష్టం చేశారు.

## సిరిసిల్ల ఏమైనా శత్రు రాజ్యమా..? ః హరీశ్ రావు

కేటీఆర్ రాకముందు సిరిసిల్ల ఎట్లుంటే.. కేటీఆర్ ఎమ్మెల్యే అయిన తర్వాత ఎట్లా మారిందో ఆ సిరిసిల్ల ప్రజలను అడుగు.. వాళ్లు చెప్తరని రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తనదైన స్టైల్‌లో చురకలంటించారు. లీడర్లు ఎక్కడికైనా ఎందుకు పోతరు.. ఒక ముఖ్యమంత్రి ప్రజలకు సేవ చేయాలి. ఈయన దండయాత్రకు పోతడట.. దండయాత్ర చేయడానికి ఏమైనా శత్రు రాజ్యమా..? యెనకట రాజులు పక్క దేశం మీద దండయాత్ర చేస్తుండేవాళ్లు. సిరిసిల్ల తెలంగాణలో లేదా..? అని ప్రశ్నించారు. 4 వేల మంది పోలీసులు.. పొద్దున 4 గంటల నుంచి నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను, ఉద్యమకారులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లలో పెడుతున్నారు. దేనికోసం పోతున్నవ్ సిరిసిల్లకు. బీఫోర్ కేటీఆర్.. ఆఫ్టర్ కేటీఆర్ ఏందో ఒక్కసారి సిరిసిల్ల ప్రజలను అడగండి వాళు చెప్తరని హరీశ్ రావు హితవు పలికారు. ఎంత ఆదర్శంగా.. ఎంత అద్భుతంగా సిరిసిల్ల తయారైందో.. కేటీఆర్ రాకముందు సిరిసిల్ల ఎట్లుంటే.. కేటీఆర్ ఎమ్మెల్యే అయిన తర్వాత ఎట్లా మారిందో ఆ సిరిసిల్ల ప్రజలను అడుగు.. వాళ్లు చెప్తరని రేవంత్ రెడ్డికి సూచించారు.

నువ్వు బయట నుంచి కొంతమంది గూండాలనో, కార్యకర్తలనో, సివిల్ డ్రెస్‌లో పోలీసోళ్లను పెట్టుకొని పోయినంత మాత్రాన సిరిసిల్ల ప్రజల తలరాతలు మారవన్నారు. సిరిసిల్ల ఆదర్శనియోజకవర్గం అయిందంటే.. అక్కడున్నరైతులకు కాళేశ్వరం జలాలు వచ్చినయంటే.. మానేరు మీద చెక్‌డ్యామ్‌లు వచ్చినయంటే..సిరిసిల్ల మున్సిపాలిటీ ఆదర్శంగా అభివృద్ధి జరిగిందంటే.. దాని వెనుక కేటీఆర్ కృషి ఉంది. నిజంగా నువ్వు ప్రజల మనసు గెలవాలంటే మేం పని చేసినదానికంటే ఎక్కువ పని చేయ్.. ఎక్కువ పథకాలు ఇయ్యు.. ఎక్కువ డబ్బులు ఇచ్చి ప్రజల మనసు గెలవాలి కానీ.. పోలీసోళ్లనో, గూండాలనో పెట్టుకొని దండయాత్ర చేస్తానంటే..నీ చౌకబారు మాటలను ప్రజలు హర్షించరు.

నువ్వు సిరిసిల్లలో నేర్చుకొని రా.. చేనేత కార్మికులకు కేసీఆర్, కేటీఆర్ ఏం చేశారో..? ఆ వరుస చెక్‌డ్యామ్‌లు కడితే ఆ మానేరు పరిసర ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో అద్భుతమైన పంటలు ఎట్లా పండినయో. చూసి నేర్చుకొరా రేవంత్ రెడ్డి.. ఇది రాష్ట్రానికి ఉపయోగపడ్తదన్నారు హరీశ్ రావు.

# ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు రెండు స్వర్ణాలు.. సీఎం రేవంత్ రెడ్డి అభినందన

ఆసియా క్రీడల్లో ఒకే రోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటిన తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితా రావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. తన అద్భుత విజయంతో చికిత తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని, రాష్ట్ర ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిందని కొనియాడారు.

ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేస్తూ, చికిత పట్టుదల, నిరంతర సాధన, దృఢ సంకల్పం యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఆమె ప్రతిభను గుర్తించి వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులకు, శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన చికిత.. ఆసియా క్రీడల్లో కాంపౌండ్ ఉమెన్స్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలను కైవసం చేసుకుంది. ముఖ్యంగా, మిక్స్‌డ్ టీమ్‌లో తన భాగస్వామి సాహిల్ జాదవ్‌తో కలిసి సాధించిన ఈ విజయంతో ఆమె 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం విశేషం. ఈ విజయం తెలంగాణ క్రీడా రంగంలో నూతనోత్సాహాన్ని నింపింది.

# హైదరాబాద్ కమిషనరేట్‌లో 18 మంది పోలీసు అధికారుల పదవీ విరమణ..





**హైదరాబాద్, (ప్రజావినికిడి):**హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 42 సంవత్సరాల పాటు సేవలందించిన 18 మంది పోలీసు అధికారులు బుధవారం పదవీ విరమణ పొందారు. బంజారాహిల్స్ లోని టీజీఐసీసీసీ ఆడిటోరియంలో వారికి ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలతో పాటు సొసైటీ తరపున అందించే రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పదవీ విరమణ అనంతరం లభించే ఆర్థిక ప్రయోజనాల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధిక వడ్డీల ఆశతో ప్రైవేట్ వ్యక్తులు, మోసపూరిత సంస్థల చేతుల్లో పడకుండా ఆ నిధులను సురక్షితమైన ప్రభుత్వ రంగ సంస్థల్లోనే డిపాజిట్ చేసుకోవాలని హితవు పలికారు. అలాగే తమ 'సెకండ్ ఇన్నింగ్స్'లో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పదవీ విరమణ చేసిన వారికి కుటుంబ సభ్యులు అండగా ఉంటూ సహకరించాలని కోరారు. పదవీ విరమణ పొందిన వారిలో ఏసీపీలు పత్తిపాటి విక్రమ్ దేవ్ (సీటీసీ), రాయకూర్ సంజయ్ కుమార్ (సైఫాబాద్)లతో పాటు ఐదుగురు ఎస్సైలు, ఆరుగురు ఏఎస్సైలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఒక కానిస్టేబుల్, ఇద్దరు ఎల్‌జీఎస్ సిబ్బంది ఉన్నారు. విధి నిర్వహణను విజయవంతంగా ముగించుకున్న వీరిని హైదరాబాద్ సిటీ పోలీస్ తరపున తరపున సగౌరవంగా వారి నివాసాల వద్ద దింపేందుకు ప్రత్యేకంగా ప్రభుత్వ వాహనాలను ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) కె.వెంకటలక్ష్మి, సీఏడీవో జేబీజే ఆనంద్ కుమార్, సీఏవో చంద్రకళ, ఏవో యాదగిరి, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సొసైటీ కార్యదర్శి నల్ల శంకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎండీ ఆసిఫ్ ఖాన్, కోశాధికారి జి.ఎం.ఎస్.విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భేరి

## లింగం పదవీ విరమణ చిట్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ప్రధానోపాధ్యాయుడు భేరి లింగం పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు హాజరై భేరి లింగం దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బక్కని నర్సింహులు మాట్లాడుతూ గురువులను గౌరవించడం సమాజ బాధ్యత అన్నారు. భేరి లింగం 35 సంవత్సరాల పాటు విద్యారంగంలో అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, తన సుదీర్ఘ సేవా కాలంలో ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఆయన క్రమశిక్షణ, బోధనా విధానం ఎందరికో ఆదర్శప్రాయమన్నారు. ఉద్యోగ విరమణ అనేది కేవలం విధుల నుంచి మాత్రమేనని, సమాజానికి భేరి లింగం వంటి వారి సేవలు ఇంకా అవసరమని అన్నారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం భేరి లింగం, పద్మమ్మ దంపతులకు బక్కని నర్సింహులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెల్‌జర్ల గ్రామ సర్పంచ్ ఆర్. బాబునాయక్, నేతలు బాధేపల్లి సిద్ధార్థ, జాంగారి రవి, తప్పుడు నర్సయ్య, ఎమ్మార్వో వెంకటేష్ ప్రసాద్, టీజేఏసీ నేత ఎం. జనార్ధన్, జాంగారి జంగయ్య, సాయన్న, కాశన్న, ఎర్ర నర్సింహులు, ఎర్ర లక్ష్మయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# హ్యాపీ బర్త్ డే ప్రభాకర్ రెడ్డి





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్‌నగర్ బ్రిలియంట్ పాఠశాల అధినేత, స్నేహశీలి, ఆత్మీయ మిత్రుడు ప్రభాకర్ రెడ్డి (తండేల్) 45వ జన్మదిన వేడుకలు ఆత్మీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ కేపీ స్వగృహంలో ప్రభాకర్ రెడ్డి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ షాద్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, మిత్రబృందం సభ్యులు శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రభాకర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రభాకర్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఇలాంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

# పాత్రికేయులే.. ప్రగతికి వారధులు..

## ఇప్పుడు సామాజిక సేవలోను భాగస్వాములు.. - షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందనలు..

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
పాత్రికేయులే ప్రగతికి వారధులుగా తమ వార్తల ద్వారా సమాజాన్ని ముందుకు నడిపిస్తున్నారని, ఇప్పుడు సామాజిక సేవల ద్వారా కూడా మరో అడుగు ముందుకు వేశారని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందించారు. షాద్ నగర్ పట్టణంలోని సిండికేట్ కాలనీలో నిరుపేద పిల్లల పాఠశాల భూమి పూజ కార్యక్రమంలో మీడియా ప్రతినిధుల గురించి ఆయన మాట్లాడుతూ, సమాజంలో జరుగుతున్న అక్రమాలను వెలుగులోకి తెచ్చి, అభివృద్ధికి తమ అక్షరం ద్వారా చేయూతను అందించే పాత్రికేయులు నిరుపేద పిల్లల కోసం ముందుకు వచ్చి రూం.3.50 లక్షలు విరాళంగా ఇవ్వడం సంతోషకరమని పేర్కొన్నారు. ఇది తెలంగాణలో ఎక్కడా లేదని, ఇక్కడ మాత్రమే సాధ్యమైందని అభినందించారు. గతంలో కళాశాల నిర్మాణానికి కూడా పాత్రికేయులు సహకరించారని, భవిష్యత్తులోనూ వారి నుంచి మరిన్ని సేవా కార్యక్రమాలు ఆశిస్తున్నామని వెల్లడించారు.

**సొంత జేబులోంచి ఖర్చు పెట్టే ఎమ్మెల్యే.. జర్నలిస్ట్ కేపీ**

ఎమ్మెల్యేలు పనులు చేయాలంటే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలి..అక్కడి నుంచి నిధులు రావాలి..కానీ అత్యవసర సమయాల్లో అవేవీ పట్టించుకోకుండా తన జేబులో నుంచి డబ్బులు తీసి పనిచేసే ఎమ్మెల్యేను తన జీవితంలో మొట్టమొదటిసారి చూస్తున్నానని జర్నలిస్టు కేపీ అన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శంకరుడు ఇప్పటిదాకా శ్రీశైలంలో



మాత్రమే ఉంటాడని అనుకున్నానని, కానీ షాద్ నగర్ లో కూడా సాక్షాత్తు శ్రీశైల శంకరుడే ఉన్నాడని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను ఉద్దేశించి విద్యాభివృద్ధి విషయంలో పేర్కొన్నారు. ఎండాకాలంలో ఐస్క్రీమ్ ఎవరైనా తింటారు..కానీ వర్షాకాలంలో తినడమే గొప్ప విషయం..అలా కాలంతో సంబంధం లేకుండా తన పని తాను సానోపేతంగా చేసుకునే ఎమ్మెల్యే అని అభినందించారు. పేద పిల్లల చదువు గురించి ఆలోచించి ప్రభుత్వానికి ప్రతిపాదన చేస్తే సమయం పడుతుందని తానే స్వయంగా కంకణం కట్టుకొని త్వరగా పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ముందుకు సాగడం సంతోషకరమన్నారు. ఇలాంటి ఎమ్మెల్యే ఉన్నందుకు గర్వపడుతున్నామని, ఆయనకు దేవుడి ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు.



**అక్షరానికి సారధి..వారధి ఎమ్మెల్యే**

**:- లట్టుపల్లి మోహన్ రెడ్డి**

అక్షరానికి సారధిగా.. వారధిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముందడుగు వేస్తున్న తీరు అభినందనీయమని సీనియర్ పాత్రికేయుడు లట్టుపల్లి మోహన్ రెడ్డి అన్నారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వ జూనియర్ కళాశాలపై దృష్టి పెట్టి ఆ కళాశాలను సొంత నిధులతో అభివృద్ధి చేయడమే కాకుండా, ఫరూక్ నగర్, మొగలిగిద్ద, నందిగామ తదితర పాఠశాలలకు నిధులు కేటాయించి పలు అభివృద్ధి పనులు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఇప్పుడు నిరుపేద పిల్లల కోసం పాఠశాల నిర్మాణానికి పూనుకొని మరో అడుగు ముందుకు వేయడం, ఇందులో పాత్రికేయులను కూడా భాగస్వామ్యం చేయడం సంతోషకరమని అన్నారు. అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు.

# యాదగిరిగుట్ట ఆర్టీసీ కార్మికుల కూటమికి గౌరవ అధ్యక్షుడిగా బీర్ల ఐలయ్య




**ఎల్బీనగర్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 30,**
యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో కార్మికుల కోరిక మేరకు ఐఎన్‌టీయూసీ, టీయూడబ్ల్యూయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఐక్య కూటమికి ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గౌరవ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించేందుకు అంగీకరించారు. డిపో అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. గతంలోనూ కార్మికుల సమస్యలు, సమ్మె సమయంలో వారికి అండగా నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి గున్న ప్రభాకర్, గ్యారేజ్ కార్యదర్శి నర్సింగ్‌రావు, డిపో అధ్యక్షుడు ప్రవీణ్, ముఖ్య సలహాదారు ఏ.ఆర్.రెడ్డి, రీజినల్ సహాయ కార్యదర్శి అనంతుల శ్రీనివాస్ గౌడ్, జంగయ్య, రాము, సత్తయ్య, లక్ష్మణ్, కేకే రెడ్డి, శంకర్, మల్లేష్ మహిళా కార్యదర్శి లక్ష్మీబాయి, సిహెచ్ రమణ, పారిజాత, పుష్పలత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేస్తాం..

## శంషాబాద్ నుంచి ఉమ్రాకు బయలుదేరిన యాత్రికులు

**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 30,** తెలంగాణలో వర్షాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. రాష్ట్ర ప్రజలను అల్లా చల్లగా చూడాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని మక్కా, మదీనాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తామని ఉమ్రా యాత్రికులు తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఉమ్రా యాత్రకు సుమారు 50 మంది యాత్రికులు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ ఫయాజ్ అలీ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు తమ బృందంలో ఉన్నారని చెప్పారు. ఇక ఉమ్రా యాత్రకు సంబంధించి సోషల్ మీడియాలో



వస్తున్న వదంతులను నమ్మవద్దని యాత్రికులు సూచించారు. అక్కడ పరిస్థితులు అనుకూలంగానే ఉన్నాయని.. అందుకే తాము యాత్రకు వెళ్తున్నామని తెలిపారు. మక్కా, మదీనాల్లో 15 రోజుల పాటు ఉండి..



తెలంగాణ ప్రజల సంక్షేమం, వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేస్తామని వెల్లడించారు. యాత్ర సురక్షితంగా పూర్తిచేసుకుని తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు.

# శంషాబాద్‌లో విషాదం

## అనారోగ్యంతో యువకుడి మృతి



**శంషాబాద్ (ప్రజావినికిడి): సెప్టెంబర్ 30,** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని బహదూర్ గూడ గ్రామానికి చెందిన మల్లేష్ (38) కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఇటీవల కాళ్లకు గాయం కావడంతో చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లాడు. కాళ్లు తొలగించాల్సి వస్తుందని వైద్యులు చెప్పడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. మల్లేష్ తల్లి ముత్యాలమ్మ సెప్టెంబర్ 25న ఎంకెపల్లి గ్రామంలోని తన కుమార్తె అరుంధ ఇంటికి వెళ్లింది. దీంతో మల్లేష్ బహదూర్‌గూడలోని ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. సెప్టెంబర్ 30న సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ఉరి వేసుకుని మల్లేష్ మృతి చెందిన విషయం కుటుంబ సభ్యులకు తెలిసింది. ముత్యాలమ్మ అల్లుడు ఎరుపుల రాజ్‌కుమార్ ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు వెంటనే బహదూర్‌గూడకు చేరుకున్నారు. అనారోగ్య సమస్యల కారణంగా మానసికంగా ఆందోళనకు గురై మల్లేష్ ఈ ఘటనకు పాల్పడి ఉంటాడని, తన కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని ముత్యాలమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు

# దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులకు సమ్మిళిత విద్యపై అవగాహన

## ప్రభుత్వ పథకాలు, సహాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి: అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి



**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 30,** రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులు ( సి.డబ్ల్యూ ఎన్ ),వారి తల్లిదండ్రులకు సమ్మిళిత విద్యపై అవగాహన సదస్సును బుధవారం శంషాబాద్ మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి ముఖ్య అతిథిగా హాజరుకాగా, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, సౌకర్యాలపై తల్లిదండ్రులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. దివ్యాంగ విద్యార్థులు ఇతరులతో సమానంగా ఎదిగేందుకు ప్రభుత్వం మౌలిక వసతులు, ఉపకార వేతనాలు, సహాయ పరికరాలు అందిస్తోందని తెలిపారు. అందుబాటులో ఉన్న సౌకర్యాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు పాఠశాల స్థాయిలో నాణ్యమైన విద్యతో పాటు ప్రత్యేక బోధనా పద్ధతులను అమలు చేస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ధైర్యంగా తమ పిల్లలను పాఠశాలలకు పంపిస్తూ విద్యాభ్యాసంలో ప్రోత్సహించాలని సూచించారు. దివ్యాంగ విద్యార్థుల రోజువారి అవసరాలు, శిక్షణకు అవసరమైన సేవలను అందించేందుకు 'దివ్యాంగ సారథి' యాప్ ద్వారా ప్రత్యేక రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీఆర్‌సీ నోడల్ ఆఫీసర్ పి. రమేష్, దివ్యాంగ సారథి ప్రాజెక్టు మేనేజర్ సాజిత ఇవాంజుల్, జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్, కోఆర్డినేటర్ బత్తిని వెంకటేష్, మండల విద్యాధికారి లక్ష్మణ్



నాయక్, ప్రధానోపాధ్యాయులు కిష్టారెడ్డి, సువర్ణ, జిల్లా రిసోర్స్ పర్సన్లు, ఐఈఆర్పీలు, ప్రత్యేక విద్యాబోధకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మరమ్మతులు చేయించరా.?

# చేయించలేరా.?

## మూలనపడ్డ చెత్త సేకరణ ఆటోలు..

## ప్రజా సొమ్ము దుర్వినియోగమా,అధికారుల నిర్లక్ష్యమా.?

## ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?




**జవహర్‌నగర్, (ప్రజావినికిడి):**
మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజల నుంచి చెత్త సేకరించేందుకు వినియోగించాల్సిన ఆటోలు మూలనపడి ఉండటం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. ప్రజల పన్నుల రూపంలో సమకూరే నిధులతో కొనుగోలు చేసిన వాహనాలు వినియోగంలో లేకుండా మరమ్మతుల పేరుతో నిరుపయోగంగా పడి ఉంటే,వాటి నిర్వహణపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### చెత్త సేకరణ వాహనాలే మూలనపడితే.. చెత్త సేకరణ ఎలా.?

ఇళ్ల నుంచి ప్రతిరోజూ చెత్త సేకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మున్సిపల్ యంత్రాంగంపై ఉంది.అయితే చెత్త సేకరణకు ఉపయోగించాల్సిన ఆటోలే వార్డు పరిధుల్లో మూలనపడి ఉంటే పారిశుద్ధ్య నిర్వహణ ఎలా సాగుతుందనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. వాహనాలు పనిచేయకపోతే వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై లేదా.?

### మరమ్మతులు చేయించలేరా.. లేక పట్టించుకోవడం లేదా.?

వాహనాలకు చిన్నపాటి మరమ్మతులు అవసరమైతే వాటిని సకాలంలో చేయించాల్సి ఉంటుంది. వాహనం పూర్తిగా పనికిరాని స్థితిలో ఉంటే దాని స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది.కానీ వాహనాలను సక్రమంగా మెంటెనెన్స్ చేయక మూలన పడ్డాయన్న విమర్శలు ఉన్నాయి. అలాగే వదిలేయడం వల్ల ప్రజాధనం పెట్టి కొనుగోలు చేసిన ఆస్తులు క్రమంగా నిరుపయోగంగా మారే ప్రమాదం ఉంది.అసలు ఈ వాహనాలు ఎప్పటి నుంచి



వినియోగంలో లేవు.? వాటి మరమ్మతులకు ఎంత ఖర్చు అవసరం.? మరమ్మతుల కోసం నిధులు కేటాయించారా.? కేటాయించి ఉంటే పనులు ఎందుకు జరగలేదు.? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని స్థానికులు కోరుతున్నారు.

### ప్రజా సొమ్ముకు బాధ్యత ఎవరిది.?

ప్రభుత్వ వాహనం అంటే ప్రజా ఆస్తి.దాని నిర్వహణ, వినియోగం, మరమ్మతులు, ఇంధనం,డ్రైవర్ విధులు తదితర అంశాలపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాలి. వాహనాలు పనిచేయకుండా నెలల తరబడి పడి ఉంటే వాటి వల్ల ప్రభుత్వానికి కలిగే నష్టాన్ని ఎవరు భరిస్తారు.? ప్రజాధనంతో కొనుగోలు చేసిన ఆస్తులను సంరక్షించడంలో వైఫల్యానికి బాధ్యత ఎవరిది.? అన్నది స్పష్టం కావాల్సి ఉంది.

### కీసర సర్కిల్ అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?

జవహర్‌నగర్ పరిధిలోని పారిశుద్ధ్య వ్యవస్థపై కీసర







సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాల్సి ఉంది. వార్డు కార్యాలయాల్లో వాహనాల పరిస్థితి,సిబ్బంది హాజరు,చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు జరుగుతున్నాయా.? అన్నది స్థానికుల ప్రశ్న. సమస్యలు ఉన్నా ఉన్నతాధికారుల దృష్టికి రాకపోవడం ఎలా సాధ్యమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### జోనల్ కమిషనర్‌కు కనిపించవా.?

సర్కిల్ స్థాయి అధికారుల పర్యవేక్షణతో పాటు జోనల్ స్థాయిలో కూడా పారిశుద్ధ్య వ్యవస్థను సమీక్షించాల్సిన అవసరం ఉంది. మూలనపడి ఉన్న వాహనాలు, పనిచేయని పరికరాలు,చెత్త సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై జోనల్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారా.? లేక కేవలం కార్యాలయ నివేదికలకే పరిమితమవుతున్నారా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా చర్యలేంటి.?

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజా ఆస్తుల నిర్వహణపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. వార్డు కార్యాలయాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, వినియోగంలో లేని వాహనాల వివరాలు సేకరించి,వాటి పరిస్థితిపై నివేదిక రూపొందించాలి. మరమ్మతులకు అవకాశం ఉన్న వాహనాలను వెంటనే పునరుద్ధరించి, పూర్తిగా పనికిరాని వాహనాలపై నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### మున్సిపల్ శాఖలో పాలన ఉందా.?

చెత్త సేకరణ ఆటోలు మూలనపడటం చిన్న సమస్యగా కనిపించినా, దాని వెనుక ప్రజా ఆస్తుల నిర్వహణ, అధికారుల పర్యవేక్షణ, పారిశుద్ధ్య వ్యవస్థ పనితీరు వంటి అనేక అంశాలు ముడిపడి ఉన్నాయి. ప్రజాధనంతో కొనుగోలు చేసిన వాహనాలు వినియోగంలో లేకుండా పాడైపోతే అది ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతుంది.
ఇప్పటికైన ఎం ఎం సి కమిషనర్, ఉన్నతాధికారులు స్పందించి జవహర్‌నగర్‌లో మూలనపడ్డ చెత్త సేకరణ ఆటోలపై పూర్తి స్థాయి తనిఖీ నిర్వహించి,ఎన్ని వాహనాలు పనిచేస్తున్నాయి, ఎన్ని మరమ్మతులకు గురయ్యాయి, ఎన్ని వినియోగంలో లేవు,వాటి నిర్వహణకు ఇప్పటివరకు ఎంత ప్రజాధనం ఖర్చు చేశారనే వివరాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

# అక్షర యాత్రలో అద్భుతాలు సృష్టిద్దాం..

## పేదల ఆశల విద్యా సౌధానికి శంకుస్థాపన

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపు

## నిరుపేదలకు అక్షర వెలుగులు పంపించడమే లక్ష్యం

## ఎం.ఎస్ రియల్టర్ అండ్ డెవలపర్స్ అధినేత మహమ్మద్ షకీల్ రూ.5 లక్షలు విరాళం

## దాతలూ.. మీకు శతకోటి వందనాలు.. ఇలాగే కలిసికట్టుగా సాగుదాం..

## నిరుపేదల బడి నిర్మాణం పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

## హాజరైన నాయకులు, జర్నలిస్టులు, సిండికేట్ కాలనీవాసులు







**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడుకోవడం ద్వారా నిరుపేద పిల్లలకు ఇక్కడ పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్నాం.. మీకోసం అక్షరాలను అంకితం చేస్తున్నాం.. సమాజానికి ఆభరణాలుగా ముస్తాబు కండి.. మీ తల్లిదండ్రుల కళ్ళల్లో ఆనందాన్ని చూడండి.. అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. షాద్ నగర్ పట్టణంలోని సిండికేట్ కాలనీలో నిరుపేద పిల్లల కోసం దాతల సహకారంతో బడి భవన నిర్మాణానికి బుధవారం షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా కాలనీవాసులు నాయకులు తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ, పాఠశాల కోసం తన సంకల్పానికి అండగా నిలిచిన దాతలు, జర్నలిస్టులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేద పిల్లలు, సమాజం మీద అవగాహన లేని కుటుంబాలను ఆదుకోవాలనే లక్ష్యంతో వారికి విద్యను అందించే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు.ఈ ప్రయత్నంలో ఎంఈఓ మనోహర్ సహకారాన్ని ప్రత్యేకంగా అభినందించారు. విద్యకు దూరంగా ఉన్న విద్యార్థులను సర్వే చేసి వారి వివరాలను అందించడం ద్వారా ముందడుగు వేసినట్లు తెలిపారు.పిల్లల తల్లిదండ్రులకు ఈరోజు ఒక అవకాశం వచ్చింది.. ప్రభుత్వమే వారి ముందుకు వచ్చి నిలబడింది..ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.చదువు ఒక్కటే సమాజంలో మార్పులు తీసుకొస్తుందని, అంబేద్కర్,అబ్దుల్ కలాం లాంటి విద్యావేత్తలను కీర్తిస్తాం తప్ప ఆదాని, అంబానీలను కీర్తించమని గుర్తు చేశారు.తాను కూడా ఒక పేద కుటుంబం నుంచే వచ్చి చదువుకొని ఎమ్మెల్యేను అయ్యానని, చదువుకున్న ప్రతి ఒక్కరికి భవిష్యత్తు అవకాశాలను కల్పిస్తుందని స్పష్టం చేశారు. అందుకే అందరం పనికట్టుకుని స్వచ్ఛందంగా మీ జీవితాల్లో వెలుగు నింపేందుకు ముందుకు వచ్చామని విద్యార్థుల తల్లిదండ్రులతో అన్నారు. విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా తీర్చిదిద్దే బాధ్యత తమదేనా అని వెల్లడించారు. విద్యార్థులకు భవనం మాత్రమే కాదు..వారికి కావలసిన పుస్తకాలు, డ్రెస్సులు, బ్యాగులు ప్రతి ఒక్కటి అందజేస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు.ఈ పాఠశాల కోసం దాదాపు 50 మంది దాతలు 5000 తో మొదలుపెట్టి 5 లక్షలు కూడా ఇచ్చిన వారు ఉన్నారని వెల్లడించారు. జీవితంలో పిల్లలకు సేవ చేసే బాధ్యత తనకు లభించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. జన్మనిచ్చిన ప్రతి తల్లికి పాదాభివందనం చేస్తున్నానని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్తయిందని, నందిగామ, ఫరూక్ నగర్, మొగిలిగిద్ద పాఠశాలలను కూడా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. ఈరోజుకు పాఠశాలల్లో హాస్టల్లో సమస్యలు ఉన్నాయంటే నాయకుల సిగ్గుపడాలని ఉద్వేగంగా పలికారు.అన్ని సమస్యలపై దృష్టి పెట్టి విజ్ఞాన కాంతులను అందించే దిశగా పోటీ తత్వంతో ముందుకు వెళ్లడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

### దయ చూపిన దాతలు

పాఠశాల నిర్వహణకు సంబంధించి తమ వంతు సహకారం అందించేందుకు దాతలు ముందుకు వచ్చారు. ఎం.ఎస్ రియాల్టర్ అండ్ డెవలపర్స్ అధినేత షకీల్ రూ.5 లక్షలు విరాళంగా ప్రకటించారు. అదేవిధంగా ప్రముఖ వ్యాపారి వైఎన్ఆర్ గెలాక్సీ వ్యాపార సంస్థకు చెందిన యెడ్ల నరేందర్ విద్యార్థులకు అవసరమైన బ్యాగులు అందజేయనున్నట్లు ప్రకటించారు. ఇక మరో దాత మందుల రమేష్ రూ.50,000 విరాళంగా ప్రకటించగా ఎమ్మార్పీఎస్ నేత పెంటనోళ్ల నరసింహ రూ. 11,000 ప్రకటించారు. జర్నలిస్ట్ ఆంజనేయులు 11,000, జేఏసి నాయకుడు జనార్ధన్ 5000 విరాళంగా ప్రకటించారు. వెలుజర్ల సర్పంచ్ బాబు నాయక్ పాఠశాల సంబంధించిన కంకర,డస్ట్ ను విరాళంగా అందజేయనున్నారు. మున్సిపల్ చైర్మన్ అగునూరు బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్,గిరిజన ఆదివాసి కోఆర్డినేటర్ రఘు, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, హాజిపల్లి సర్పంచ్ కుమార్ తదితరులు కార్యక్రమంలో ప్రసంగించారు.

### భవిష్యత్తు నిర్మాణ సారథులు మీరే..ఎంఈఓ మనోహర్

సిండికేట్ కాలనీలో నిర్మించబోతున్న ప్రభుత్వ బడికి స్వచ్ఛందంగా దాతలు ముందుకు వచ్చి సహకరించడం, బడి లేని పిల్లలు ఎంత అదృష్టవంతులు అంటే వారి పాఠశాలను వారే నిర్మించుకొని వారి తలరాతను వారే మార్చుకున్న ఘనత చిరస్థాయిగా నిలిచిపోతుందని అంతటి అదృష్టవంతులు విద్యార్థులు అంటూ ఫరూక్ నగర్ మండల విద్యాశాఖ అధికారి మనోహర్ సభలో వ్యాఖ్యానించారు
దాతలకు తదితర ప్రజాప్రతినిధులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్,పట్టణ అధ్యక్షుడు శ్రీధర్ ముదిరాజ్, మండల విద్యాధికారి మనోహర్, కౌన్సిలర్ కొప్పు నూరి ప్రవీణ్, హాజపల్లి గ్రామ సర్పంచ్ కుమార్ ఉప సర్పంచ్ గంగాధర్, కౌన్సిలర్ పెంటయ్య,రాజు నాయక్ దిలీప్, బచ్చలి నరేష్, ముబారక్ అలీ ఖాన్,సాదిక్ ఫరూఖ్ నగర్ మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ హాజుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి అనూష,గిరిజన ఆదివాసి రాష్ట్ర కో ఆర్డినేటర్,రఘు నాయక్, ఇబ్రహీం,శ్రీశైలం గౌడ్,మధువలు యాదవ్, సుదర్శన్,బాబు నాయక్,శ్రీను నాయక్, రవీందర్ రెడ్డి,విజయ్ కుమార్ రెడ్డి, జాంగారి రవి, ప్రశాంత్ పెంటనోళ్ళ నరసింహ, సయ్యద్ సాదిక్ భాయ్,రవితేజ మహేందర్, ఇసాక్,ప్రముఖ వ్యాపార వేత్తలు షకీల్,జహాశీగిర్, టి జేఏసీ నేతలు జనార్దన్,సిద్ధార్థ, కరుణాకర్, రాము గోర్ల, అర్జున్,నరేష్ వెంకటేష్, జంగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# శంషాబాద్‌లో డ్రగ్స్ పట్టివేత.. ముగ్గురు అరెస్ట్..

## 80 గ్రాముల మెథాంఫెటమైన్4ఎల్ఎస్‌డీ బ్లాట్లు స్వాధీనం





**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 30,** ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు సెప్టెంబర్ 29న మధ్యాహ్నం 12.20 గంటలకు సంపత్‌నగర్ రోడ్డులోని హెచ్ఎండీఏ నర్సరీ సమీపంలో పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 80 గ్రాముల మెథాంఫెటమైన్ (మెత్),నాలుగు ఎల్ఎస్‌డీ బ్లాట్లు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ డివిజన్ ఏసిపి శ్రీకాంత్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరుకు చెందిన ప్రధాన డ్రగ్ పెడ్లర్ జంషెడ్ నుంచి మెథాంఫెటమైన్ ను తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ప్రధాన నిందితుడు సయ్యద్ సయీద్ హుస్సేన్ తన సహచరులైన మొహమ్మద్ ఇమ్రాన్,రహీం ఉద్దీన్ ల ద్వారా బెంగళూరు నుంచి డ్రగ్స్ తెప్పించేవాడని తెలిపారు. అనంతరం వాటిని స్థానికంగా అధిక ధరలకు విక్రయించడంతో పాటు సబ్ పెడ్లర్ సయ్యద్ జోహైర్ మెహదీకి సరఫరా చేసేవారని పేర్కొన్నారు. పోలీసులు సయ్యద్ సయీద్ హుస్సేన్ వద్ద నుంచి 60 గ్రాముల మెథాంఫెటమైన్, మొహమ్మద్ ఇమ్రాన్,రహీం ఉద్దీన్ వద్ద నుంచి మరో 20 గ్రాముల మెథాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ విక్రయానికి సంబంధించి పరస్పరం లావాదేవీలు జరుపుతున్న సమయంలో ముగ్గురిని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. సయ్యద్ సయీద్ హుస్సేన్‌పై గతంలో ఆస్తి సంబంధిత నేరాల్లో 270కి పైగా కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మొహమ్మద్ ఇమ్రాన్‌పై ఇప్పటికే మూడు ఎన్‌డీపీఎస్ కేసులు ఉన్నట్లు తెలిపారు.ఈ కేసులో బెంగళూరుకు చెందిన ప్రధాన పెడ్లర్ జంషెడ్, సబ్ పెడ్లర్ సయ్యద్ జోహైర్ మెహదీ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.డ్రగ్స్ ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయి, ఎవరికి విక్రయిస్తున్నారు, ఈ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే అంశాలపై పోలుసుల దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తు పూర్తయ్యే నాటికి నిందితుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై క్రైమ్ నంబర్ 862/2026గా ఎన్‌డీపీఎస్ చట్టం-1985లోని సెక్షన్ 8(సి) రెడ్‌విత్ 22(బి), 22(సి) కింద కేసు నమోదు చేశారు. కేసును ఛేదించిన ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ బి. సంజీవులు, డీఐ జి. పవన్‌కుమార్, వారి సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

**ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి**

గంజాయి,ఇతర మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలు, రవాణా,నిల్వ, సరఫరాపై నిరంతరం దాడులు నిర్వహిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను సాధ్యమైనంత వరకు గోప్యంగా ఉంచుతామని శంషాబాద్ ఏసిపి శ్రీకాంత్ గౌడ్ తెలిపారు

# అక్టోబర్ 6న మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభ

## హయత్‌నగర్‌లో విద్యార్థులతో సమావేశం




**హయత్‌నగర్,(ప్రజావినికిడి):** అక్టోబర్ 6న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలోని హయత్‌నగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జాతి భవిష్యత్ కోసం,పీడిత వర్గాల విముక్తి కోసం విద్యార్థి తరమే భవిష్యత్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని అన్నారు. చదువుకున్న విద్యార్థి యువతను ఉద్యమంలో భాగస్వామ్యం చేయడం ద్వారా సామాజిక చైతన్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. అక్టోబర్ 6న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.సభకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ ఎల్బీనగర్ ఇంచార్జి ఎర్ర రవీందర్ మాదిగ, ఎంఆర్పీఎస్ ఎల్బీనగర్ ఇంచార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ, ఎంఆర్పీఎస్ ఎల్బీనగర్ కో-ఇంచార్జి క్యాదాస్ సతీష్ మాదిగ, ఎంఆర్పీఎస్ హయత్‌నగర్ మండల అధ్యక్షులు కొమ్ము శివ మాదిగ,మండల అధికార ప్రతినిధి కొంగరి జానకిరామ్ మాదిగతో పాటు పలువురు మాదిగ విద్యార్థులు పాల్గొన్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా కొకైన్ పట్టివేత

## రూ.24.5 కోట్ల విలువైన 4.9 కిలోల కొకైన్ స్వాధీనం.. ప్రయాణికుడు అరెస్ట్




**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 30,** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా కొకైన్ తరలిస్తున్న ఓ ప్రయాణికుడిని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ.24.5 కోట్ల విలువైన 4.9 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.దోహా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ భారతీయ ప్రయాణికుడు తన లగేజీలో కొకైన్ తరలిస్తున్నట్లు అందిన పక్కా సమాచారంతో డీఆర్ఐ అధికారులు ఆర్జీఐఏలో నిఘా ఏర్పాటు చేశారు. అనుమానిత ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని క్యాబిన్ బ్యాగేజీని తనిఖీ చేయగా,ఏడు లిండ్ట్ లిండోర్ అసార్టెడ్ ఫిల్డ్ డార్క్ చాక్లెట్ సెలక్షన్ ట్యూబ్‌లు గుర్తించారు. ఒక్కో ట్యూబ్‌పై 387 గ్రాముల బరువు ముద్రించి ఉన్నప్పటికీ.. ట్యూబ్‌ల బరువు అసాధారణంగా ఉండటంతో అధికారులు వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ట్యూబ్‌లను తెరిచి తనిఖీ చేయగా చాక్లెట్ల మధ్య లేత పసుపు రంగులోని 207 అండాకారపు క్యాప్సూల్స్ దాచి ఉంచినట్లు గుర్తించారు. క్యాప్సూల్స్‌లోని తెల్లని పొడి పదార్థాన్ని నార్కోటిక్ డ్రగ్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించగా అది కొకైన్‌గా నిర్ధారణ అయింది. మొత్తం 4.9 కిలోల కొకైన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.24.5 కోట్లుగా అంచనా వేశారు. ఎన్‌డీపీఎస్ చట్టం-1985 కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. కొకైన్‌ను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న నెట్‌వర్క్‌లో మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో డీఆర్ఐ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# జిల్లా స్థాయికి పోటీలకు ఎజిహెచ్ఎస్ పెదగొల్లగూడెం విద్యార్థినుల ఎంపిక



**వాజేడు,అక్టోబర్ 1,(ప్రజావినికిడి):**పెదగొల్లగూడెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచి ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.అండర్-17 విభాగంలో వాలీబాల్‌కు కారం సాయినీరజ, యాలం తరంగిని (10వ తరగతి), కబడ్డీకి మిచ్చా ఇందు (10వ తరగతి),డిస్కస్ త్రోకు పాయం యోగితాశ్రీ (10వ తరగతి) ఎంపికయ్యారు.అండర్-14 విభాగంలో 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్‌లో బడే హర్షిత,బడే హర్షిని ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారు. 200 మీటర్ల పరుగు విభాగంలో తుర్స అక్షర ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఖో-ఖోలో కుర్సం కీర్తన ఎంపికయ్యారు. విద్యార్థినుల ఈ విజయాన్ని అభినందిస్తూ ఎజిఎచ్ఎస్ పెదగొల్లగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇర్ప కేశవరావు, ఉపాధ్యాయులు రోజారాణి, తిరుపతమ్మ, బుచ్చిబాబు, కృష్ణయ్య, రామారావు, భారతి, ఉమాదేవి, సౌజన్య,ఫిజికల్ డైరెక్టర్ రాజు, అలాగే కవిత, ధనలక్ష్మి,గౌతమి విద్యార్థినులకు అభినందనలు తెలిపారు.విద్యార్థినులు జిల్లా స్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థినుల విజయానికి కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులను ఈ సందర్భంగా అభినందించారు.

# షేక్ లియకత్ అలీకి ఘన సన్మానం





**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో క్లీనర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీ షేక్ లియకత్ అలీ 33 సంవత్సరాల సుదీర్ఘ సేవలను పూర్తి చేసుకొని బుధవారం, 30-09-2026న పదవీ విరమణ పొందారు.ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించి,శ్రీ షేక్ లియకత్ అలీని కార్యాలయ అధికారి అలాగే సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా సిబ్బంది అభినందించారు.దీర్ఘకాలం పాటు కార్యాలయంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి,తన సేవలతో సహచరుల మన్ననలు పొందిన శ్రీ షేక్ లియకత్ అలీకి అధికారులు, సిబ్బంది పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి బాలేశ్వరి, ఏవీఎస్ ప్రసాద్, టైపిస్టు అనిత, ఆఫీస్ సబార్డినేట్ ఫకీర్ చంద్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచులను సన్మానించిన తాసిల్దార్




**వాజేడు,అక్టోబర్ 1,(ప్రజావినికిడి):**మండలంలో ముంపు ప్రాంతాలైన చీకుపల్లి, గుమ్మడిదొడ్డి, గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు ఈ సంవత్సరం వరదల వలన కొన్ని గ్రామాలు నీట మునిగాయి అపుడు వచ్చినటు వంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటూ రాత్రింబవళ్లు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజలకు సహాయ సహకారాల అందించినటువంటి చీకుపల్లి సర్పంచ్ గొంది సత్యనారాయణ గుమ్మడిదొడ్డి సర్పంచ్ బొదెబోయిన భరత్ కుమార్ ని తాహసిల్దార్ కార్యాలయంలో తాసిల్దారు డిటి, ఆర్ఐ,రెవిన్యూ సిబ్బంది సాలువతో ఘనంగా సన్మానించారు

# షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా సఫాయిమిత్ర సురక్షాలో భాగంగా కార్మికులకు సన్మానం

**పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం మున్సిపల్ చైర్మన్.. - పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహణ**






**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**

పట్టణ పరిశుభ్రత కోసం నిత్యం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో అభినందనీయమని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పేర్కొన్నారు.

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో 5వ ఏబీ దినోత్సవం సందర్భంగా చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రత్యేక హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు.ఈ సందర్భంగా సఫాయిమిత్ర సురక్షా సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం కష్టపడే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం,సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో వైద్య సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులకు పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.అలాగే ముందస్తు ఆరోగ్య పరిరక్షణపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కొప్పునూరి ప్రవీణ్, దిలీప్,డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ విజయలక్ష్మి,హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్,ఇతర మున్సిపల్ అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 25 ఏళ్లుగా సేవలు.. జీతంలో మాత్రం వివక్ష..

## జీహెచ్ఎంసీ కార్మికులతో సమానంగా వాటర్ మాన్ లకు వేతనాలు కల్పించాలి..

## తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు చిన్నగండు రాజేందర్ డిమాండ్..



**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 30,** శంషాబాద్‌లో గత 25 ఏళ్లుగా ప్రజలకు తాగు నీటి సేవలు అందిస్తున్న వాటర్‌మెన్‌లకు జీహెచ్ఎంసీ కార్మికులతో సమానంగా వేతనాలు చెల్లించాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు చిన్నగండు రాజేందర్ డిమాండ్ చేశారు.గ్రామ పంచాయతీగా ఉన్న నాటి నుంచి మున్సిపాలిటీగా, అనంతరం జీహెచ్ఎంసీలో విలీనమైనా వాటర్‌మెన్‌లు మాత్రం తమ విధులను నిర్విరామంగా కొనసాగిస్తూ ప్రజలకు తాగునీటి సరఫరాలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు.ఎండ, వానను లెక్కచేయకుండా, రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్న కార్మికులకు మాత్రం ఇతర జీహెచ్ఎంసీ కార్మికులతో సమానంగా వేతనాలు అందకపోవడం బాధాకరమన్నారు.25 ఏళ్లుగా సేవలందిస్తున్న వారి కష్టాన్ని, అనుభవాన్ని గుర్తించి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. అంతేకాకుండా ఉద్యోగ భద్రత కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలంగా ప్రజలకు సేవలందిస్తున్న వాటర్‌మెన్‌ల సమస్యలను అధికారులు మానవతా దృక్పథంతో పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని చిన్నగండు రాజేందర్ కోరారు.వారి 25 ఏళ్ల సేవలకు తగిన గుర్తింపు కల్పిస్తూ జీహెచ్ఎంసీ కార్మికులతో సమాన వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## శంషాబాద్‌లో చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 30,** మదనపల్లి పాత తండాలో విషాద ఘటన చోటుచేసుకుంది. నక్కలకుంట చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది.ఈ ఘటన శంషాబాద్ (పెద్దషాపూర్) పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని మదనపల్లి పాత తండా గ్రామ కారోబార్ ముడావత్ నరేష్‌కు నక్కల కుంట చెరువులో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. ఆయన వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించగా, సుమారు 30 నుంచి 35 వయస్సు గల మగ వ్యక్తి నీటిలో మృతి చెందినట్లు కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు నలుపు రంగు అండర్‌వేర్,కుడి చేతిపై టాటూ ఉంది.చెరువు గట్టుపై నీలం రంగు నైట్ ప్యాంట్,గ్రే రంగు ఫుల్‌హ్యాండ్ షర్ట్, ఎరుపు రంగు స్లిప్పర్లు లభించాయి. చుట్టుపక్కల గ్రామస్థులను పోలీసులు విచారించగా, మృతుడు స్క్రాప్ సేకరించి విక్రయిస్తూ తిరిగే వ్యక్తిగా గుర్తించినట్లు తెలిసింది. ఇటీవల అదే చెరువులో వినాయక నిమజ్జనం కూడా జరిగినట్లు స్థానికులు తెలిపారు. స్క్రాప్ సేకరించే క్రమంలో చెరువులోకి దిగి, ఈత రాక ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.ముడావత్ నరేష్ ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతుడి వివరాలు తెలిసిన వారు శంషాబాద్ (పెద్దషాపూర్) పోలీసులను సంప్రదించాలని ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి తెలిపారు.

## మత్తును కలిగించే సిరప్ ల పట్టివేత..



**నాంపల్లి, (ప్రజావినికిడి):**
అమ్మడమే నేరం ఆపై ఎక్కువ ధరకు అమ్మకాలు.డ్రగ్స్ ఎడిక్ట్ వ్యక్తులకు మత్తు కోసం మత్తును కలిగించే సిరప్ లను డాక్టర్ స్క్రిప్షన్ లేకుండా వినియోగదారులకు రూ.200 బదులు రూ.500 తీసుకుంటూ అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్న మెడికల్ యజమాని మెడికల్ హాల్ యజమానిపై ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ టీం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మంజు సిబ్బంది కలిసి దాడి చేసి 50 మత్తు కలిగించే 50 బాటిల్లను పట్టుకున్నారు. తార్నాక నాగార్జున కాలనీలో ఏబీ జెనరిక్ అనే మందుల దుకాణంలో ఈ మత్తు మందు కలిగించే సిరప్ లను అమ్మకాలు జరుపుతున్నారు. ఈ కేసులో కాజా బషీర్ ఉద్దీన్ ఖాన్ అనే వ్యక్తి మత్తు కలిగించే సిరప్‌లను డాక్టర్ ప్రేక్షిప్సన్ లేకుండా అమ్మకాలు జరుపుతున్నట్లు అతనిపై కేసు నమోదు చేశారు. మరో అడుగు ముందుకు వేసిన నిందితుడు అవసరం ఉన్న డ్రగ్ ఎడిక్ట్ వ్యక్తులకు రాపిడో లాంటి సౌకర్యాలను కూడా కల్పిస్తూ రూ 200 సిరప్ కు మరింతగా డిమాండ్ ఎక్కువ తీసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నిందితుడిని నుంచి 50 మత్తుమందు కలిగించే సిరప్ లను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సిఐ తెలిపారు.

## మండలంలోని పెండింగ్ దరఖాస్తులని త్వరిత గతిన పరిష్కరించాలి

**కొందుర్గు తాసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదరపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి**



**షాద్ నగర్,(ప్రజావినికిడి)**
నియోజకవర్గంలోని కొందుర్గు మండల కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి సందర్శించి,తహసీల్దార్ అలాగే సిబ్బందితో వివిధ రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా భూ భారతి పెండెన్సీ, రీ-సర్వే పనుల పురోగతి, మండలంలో పెండింగ్‌లో ఉన్న వివిధ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు, కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ దరఖాస్తుల స్థితిగతులు, ఎఫ్-లైన్ పిటిషన్ల పరిష్కారంపై సమీక్షించారు.పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును పరిశీలించి,త్వరీ తగిన పరిష్కరించాలి.నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ మరియు సిబ్బందిని ఆదేశించారు. సమీక్షించిన అన్ని అంశాల్లో ఉన్న పెండెన్సీలను 10 రోజుల్లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని,ప్రతి అంశంపై తీసుకున్న చర్యలు,సాధించిన పురోగతిపై సమగ్ర కంప్లయన్స్ నివేదికను సమర్పించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి,ప్రజలకు నిర్ణీత సమయంలో సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

## రతన్ కాలనీలో మ్యాన్ హోల్స్ మరమ్మతులు

**కాలనీవాసుల సమస్యలపై స్పందించిన నడికూడ అనిత రఘునాథ్ యాదవ్**



**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు రతన్ కాలనీలో మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించింది.గత కొన్ని రోజులుగా మోరీలు నిండిపోవడంతో పాటు మ్యాన్‌హోల్స్ వద్ద ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో కాలనీవాసుల విన్నపం మేరకు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,వార్డ్ కౌన్సిలర్ నడికూడ అనిత రఘునాథ్ యాదవ్ స్పందించారు.మున్సిపల్ కార్మికులతో మోరీల మరమ్మతు పనులు చేపట్టి,మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు.పనులను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో 22వ వార్డులో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే అందుబాటులో ఉండి పరిష్కారానికి కృషి చేస్తానని కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్ కాలనీవాసులకు భరోసా ఇచ్చారు.సమస్యపై స్పందించి మరమ్మతు పనులు చేపట్టినందుకు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

# రూ.1.82 కోట్ల గంజాయి పట్టివేత..

**365 కేజీల గంజాయి స్వాధీనం**

**లారీ,కారు,బైక్ స్వాధీనం**

**ఇద్దరు వ్యక్తుల అరెస్ట్**



**ఖమ్మం, (ప్రజావినికిడి):**
ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు మూడు వాహనాల్లో తరలి వెళ్తున్న గంజాయిని ఖమ్మం జిల్లా భద్రాచలం డిటిఎఫ్ ఇతర ఎక్సైజ్ టీములు కలిసి పట్టుకున్నారు. ఈ మూడు వాహనాల్లో 365 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.1.82 కోట్లుగా ఉంటుందని ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు.కేసు వివరాల్లోకి వెళితే.. భద్రాచలం వీరభద్ర ఫంక్షన్ హాల్ సమీపంలో డిటిఎఫ్ కొత్తగూడెం టీం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖిలో తొలతగా బైక్ పై వస్తున్న వ్యక్తి వద్ద తొమ్మిది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒరిస్సాకు చెందిన దివాకర్ మండల్(22) అనే వ్యక్తి వద్ద 9 కిలాల గంజాయితో పాటు బైకును సీజ్ చేశారు.బైక్ వెనుక వస్తున్నటువంటి హుందాయి కార్ పై అనుమానం వచ్చి ఎక్సైజ్ టీంలు తనిఖీలు నిర్వహించగా కారులో 100 కేజీల గంజాయి లభ్యమైంది.ఈ కేసులో ఎలక్ట్రిషన్ గా పనిచేసే అటువంటి ఒరిస్సాకు చెందిన సుమన్ పాల్ (22)ను అదుపులోకి తీసుకున్నారు. కారు,బైక్ పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను విచారించగా మరో లారీలో కూడా గంజాయి ఉన్నట్లు నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు కరుణగిరి వద్ద ఆగి ఉన్నటువంటి లారీని తనిఖీలు చేయగా 263.2 కేజీల గంజాయి పట్టుబడింది. లారీలో ఉన్న రాజశేఖర్ మార్గి (22),లారీ లో ఉన్న క్లీనర్ బ్రిజన్ నాసా(20) ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు వీరిద్దరు కూడా ఒరిస్సాకు చెందిన వ్యక్తులుగానే గుర్తించారు.లారీ కూడా ఒరిస్సా ప్రాంతానికి చెందినదిగా ఉంది. కొత్తగూడెం డిటిహెచ్ సిఐ రమాదేవి,మరో సిఐ కిష్టయ్య, నరేందర్ రెడ్డితో పాటు ఎస్ఐ సలీముల్లా ఖాన్, శ్రీధర్ రావులతో కలిపి సిబ్బంది కరీం,మౌలాంకర్, వీరబాబు, శ్రీనివాస్, నర్సింహరావు, రమేష్, పార్థసారధి, విల్సన్, సీతారాం, వీరభద్రం,రాకేష్, కిరణ్,ప్రసన్న కుమార్ ఈ ఆపరేషన్ లో పాల్గొన్నారు. గంజాయిని పట్టుకున్న ఖమ్మం టీంలను ఎక్సైజ్ ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ అవినాష్ మహంతి, ఎన్ఫోర్స్మెంట్ జాయింట్ కమిషనర్ అంజన్ రావు, ఖమ్మం డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి అభినందించారు.

# 25 ఏళ్ల సేవలకు గుర్తింపు ఎప్పుడు.?

**జీహెచ్ఎంసీలోనే కొనసాగించాలని వాటర్‌మెన్‌ల విజ్ఞప్తి -హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీకి బదిలీపై ఆందోళన**

**ఇతర కార్మికులతో సమానంగా వేతనాలు కల్పించాలని డిమాండ్**



**శంషాబాద్,(ప్రజావినికిడి):** శంషాబాద్ గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి నుంచి నేటి జీహెచ్ఎంసీ వరకు దాదాపు 25 ఏళ్లుగా ప్రజలకు తాగునీటి సేవలందిస్తున్న వాటర్‌మెన్‌లు తమ భవిష్యత్‌పై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమకు ఇప్పటికీ తగిన గుర్తింపు, వేతన భద్రత, ఉద్యోగ భద్రత కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
శంషాబాద్ గ్రామ పంచాయతీ మున్సిపాలిటీగా, అనంతరం జీహెచ్ఎంసీలో విలీనమైనప్పటికీ తమ విధుల్లో ఎలాంటి మార్పు లేకుండా ప్రజలకు సేవలు అందిస్తున్నామని వాటర్‌మెన్‌లు తెలిపారు.రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ తాగునీటి సరఫరాలో కీలకంగా పనిచేస్తున్న తమకు ఇతర జీహెచ్ఎంసీ కార్మికులతో సమానంగా వేతనాలు అందడం లేదని పేర్కొన్నారు.

**బదిలీపై భయాందోళనలు**

జీహెచ్ఎంసీ నుంచి వాటర్‌మెన్‌లను హెచ్ఎండబ్ల్యూఎస్-ఎస్‌బీకి అప్పగించే ప్రతిపాదన తమ కుటుంబాలపై ఆర్థిక భారం పెంచుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అక్కడ తక్కువ వేతనాలు లభించే పరిస్థితి ఉంటే తమ జీవనోపాధి దెబ్బతింటుందని చెబుతున్నారు. ఇన్నేళ్లుగా జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న తమను అదే సంస్థలో కొనసాగించాలని కోరుతున్నారు.

**మానవతా దృక్పథంతో చూడాలి**

తమ సమస్యలను జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన వాటర్‌మెన్‌లు.. 25 ఏళ్ల సేవలను పరిగణనలోకి తీసుకుని మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీకి బదిలీ చేయకుండా జీహెచ్ఎంసీలోనే విధులు నిర్వహించే అవకాశం కల్పించాలని,ఇతర కార్మికులతో సమానంగా వేతనాలు,ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.ప్రజలకు ఇన్నేళ్లుగా అందిస్తున్న సేవలకు తగిన గుర్తింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు జగ్గాల సామువేల్,ఏపూరి పవన్,మైలారం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా





**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
నియోజకవర్గంలోని జిల్లేడు చౌదరిగూడ మండలం పెద్ద ఎలికిచెర్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అండగా నిలిచారు.చిన్నగళ్ళ మరియమ్మ కుటుంబాన్ని పరామర్శించి,కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా ఆవు మృతి చెందడంతో నష్టపోయిన బీఆర్ఎస్ కార్యకర్త దొరమోని శ్రీను కుటుంబాన్ని కూడా అంజయ్య యాదవ్ పరామర్శించారు.వారి పరిస్థితిని తెలుసుకుని ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ,బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, కష్టసమయంలో కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యులకు భరోసాగా నిలవడమే తన బాధ్యత అని అన్నారు.కార్యకర్తల సంక్షేమం కోసం తన వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ కొనసాగిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల,గ్రామ ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు,బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎన్నికలకు సిద్ధం కావాలి






**ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తం కావాలని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారందరి ఓట్లను పెద్ద ఎత్తున నమోదు చేయించాలని కార్యకర్తలకు సూచించారు.
మహేశ్వరం నియోజకవర్గం జిల్లెలగూడ సామ యాదిరెడ్డి గార్డెన్స్‌లో మహబూబ్‌నగర్-హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన మహేశ్వరం నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశంలో సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ప్రతి ఒక్కరిని గుర్తించి, అర్హత ఉన్న వారందరి ఓట్లను పెద్ద ఎత్తున నమోదు చేయించేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.
గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తలందరి సహాయ సహకారాలు, కృషితో సురభి వాణీదేవిని గెలిపించుకోవడం జరిగిందని గుర్తుచేశారు. అదే పోరాట స్ఫూర్తితో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు.
అభ్యర్థి ఎవరైనా కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ ముందుకు సాగాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేసి పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మహేశ్వరం నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ప్రపంచ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో భారత్ ఎక్కడ?

**ఐఐఎస్సీకి ప్రపంచంలో 254వ ర్యాంకు**

**టాప్-200లో లేని ఒక్క భారతీయ వర్సిటీ**

**భారత్ నుంచి 143 యూనివర్సిటీలు**

**సేవితకు 326-350 ర్యాంకు**

**501-550 బ్యాండ్‌కు చేరిన కేఐఐటీ**



**సెప్టెంబర్ 30(ప్రజావినికిడి):** బెంగళూరులోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్' (ఐఐఎస్సీ) మరోసారి భారతీయ యూనివర్సిటీల్లో అత్యుత్తమ స్థానంలో నిలిచింది. 'టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్' (టీహెచ్‌ఈ) వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2027లో ఐఐఎస్సీ ప్రపంచవ్యాప్తంగా 254వ స్థానాన్ని దక్కించుకుంది. అయితే టాప్-200లో ఒక్క భారతీయ విద్యాసంస్థకూ చోటు దక్కలేదు.ఈసారి టీహెచ్‌ఈ ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి 143 యూనివర్సిటీలు ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే 15 సంస్థలు పెరిగాయి. వరుసగా రెండో ఏడాది ఆసియాలో అత్యధిక యూనివర్సిటీలకు ప్రాతినిధ్యం వహించిన దేశంగా భారత్ నిలిచింది.

ఐఐఎస్సీ తర్వాత సేవిత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ 326-350 ర్యాంకింగ్ బ్యాండ్‌లో ఉంది. షూలిని యూనివర్సిటీ 451-500 బ్యాండ్‌లో నిలిచింది. జామియా మిల్లియా ఇస్లామియా, కేఐఐటీ యూనివర్సిటీ 501-550 బ్యాండ్‌లో చోటు సంపాదించాయి.

2026 ర్యాంకింగ్స్‌తో పోలిస్తే సేవిత 351-400 నుంచి 326-350 బ్యాండ్‌కు చేరింది. కేఐఐటీ 601-800 నుంచి 501-550కి వచ్చింది. షూలిని 401-500 నుంచి 451-500 బ్యాండ్‌లో ఉంది. జామియా మిల్లియా ఇస్లామియా 401-500 నుంచి 501-550 బ్యాండ్‌కు వెళ్లింది. ఐఐఎస్సీ గతేడాది 201-250 బ్యాండ్‌లో ఉండగా.. ఈసారి 254వ స్థానంలో నిలిచింది.

ఐఐఎస్సీ మొత్తం 57.0 స్కోరు సాధించింది. పరిశోధన వాతావరణంలో 98.0 స్కోరు నమోదు చేసింది. బోధనలో 62.1, పరిశోధన నాణ్యతలో 58.6 స్కోర్లు వచ్చాయి. సేవిత మొత్తం స్కోరు 52.3-53.3 మధ్య ఉంది.టీహెచ్‌ఈ 2027 ర్యాంకింగ్స్‌లో 118 దేశాలు, ప్రాంతాలకు చెందిన 2,297 యూనివర్సిటీలు ఉన్నాయి. ఆసియా నుంచి 1,000కుపైగా యూనివర్సిటీలు ఈ జాబితాలో ఉన్నాయి. గతేడాది ఈ సంఖ్య 929.ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ మొదటి స్థానాన్ని దక్కించుకుంది. వరుసగా 11వ ఏడాది ఆక్స్‌ఫర్డ్ టాప్‌లో నిలిచింది. ఎంఐటీ రెండో స్థానంలో, ప్రిన్స్‌టన్-స్టాన్‌ఫోర్డ్ సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నాయి. కేంబ్రిడ్జ్ ఐదో స్థానంలో నిలిచింది.

# ఇకపై ఇంటర్నెట్ లేకుండానే మొబైల్‌లో లైవ్ టీవీ!



మొబైల్ ఫోన్‌లో లైవ్ టీవీ ఛానల్స్ చూడటానికి ఇకపై ఇంటర్నెట్ డేటా లేదా వైఫై అవసరం లేదు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం 'డైరెక్ట్-టు-మొబైల్' అనే సరికొత్త టెక్నాలజీని వాణిజ్యపరంగా అందుబాటులోకి తెచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ టెక్నాలజీ ద్వారా సిమ్ కార్డు, డేటా కనెక్షన్ లేకపోయినా నేరుగా మొబైల్‌లోనే టీవీ ప్రసారాలను వీక్షించవచ్చు.

**ఏంటీ D2M టెక్నాలజీ?**

D2M అనేది బ్రాడ్‌కాస్టింగ్, బ్రాడ్‌బ్యాండ్ కలయికతో పనిచేసే సాంకేతికత. దీని ద్వారా ఎలాంటి ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే లైవ్ టీవీ, వీడియోలు, ఇతర మల్టీమీడియా కంటెంట్‌ను నేరుగా మొబైల్స్‌కు ప్రసారం చేయవచ్చు. ముఖ్యంగా ఇంటర్నెట్ సిగ్నల్స్ బలహీనంగా ఉండే గిరిజన, అటవీ, కొండ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లోని ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.ప్రసార భారతి, ఐఐటీ కాన్పూర్, తేజస్ నెట్‌వర్క్స్ (గతంలో సాంఖ్య ల్యాబ్స్) సంయుక్తంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా 19కి పైగా నగరాల్లో ట్రయల్స్ విజయవంతంగా పూర్తయ్యాయి. వాణిజ్యపరమైన అమలు కోసం అక్టోబర్‌లో రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ జారీ చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 470-582 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్ బ్యాండ్‌లో ఈ ప్రసారాలు జరుగుతాయని, దీనివల్ల సెల్యులార్ నెట్‌వర్క్‌లకు ఎలాంటి అంతరాయం ఉండదని పరిశోధకులు స్పష్టం చేశారు.అయితే, ఈ టెక్నాలజీ విస్తృత వినియోగానికి కొన్ని సవాళ్లు ఉన్నాయి. ఐ2వీ ప్రసారాలను స్వీకరించేందుకు ఫోన్లలో ఏటీఎస్‌సీ 3.0 ప్రమాణాలకు అనుగుణమైన హార్డ్‌వేర్ ఉండాలి. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న చాలా స్మార్ట్‌ఫోన్లు దీనికి సపోర్ట్ చేయవు. మరోవైపు, ఈ టెక్నాలజీ వల్ల తమ డేటా ఆదాయానికి గండి పడుతుందని టెలికాం కంపెనీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# ఫేస్‌బుక్ ఆలోచన మన భారతీయుడిదే..

## జుకర్‌బర్గ్‌పై కోర్టుకెక్కి రూ.వందల కోట్లు పొందిన యువకుడు!

**ఫేస్‌బుక్ ఆలోచన వెనుక దివ్య నరేంద్ర కృషి**

**2002లో 'హార్వర్డ్ కనెక్షన్' ప్రాజెక్టు ప్రారంభం**

**వింక్లెవాస్ సోదరులతో కలిసి దివ్య ప్రణాళిక**

**2003లో ప్రాజెక్టులోకి వచ్చిన మార్క్ జుకర్‌బర్గ్**

**వింక్లెవాస్, దివ్యకు తెలియకుండా 2004లో ఫేస్‌బుక్ ప్రారంభించిన జుకర్‌బర్గ్**





**సెప్టెంబర్ 30(ప్రజావినికిడి):** ఫేస్‌బుక్ సృష్టికర్తగా మార్క్ జుకర్‌బర్గ్ పేరు ప్రపంచవ్యాప్తంగా తెలుసు. కానీ ఈ సోషల్ మీడియా వేదిక ఆలోచన వెనుక ఓ భారతీయ మూలాలున్న యువకుడి కృషి కూడా ఉంది. అతడే దివ్య నరేంద్ర. ఫేస్‌బుక్ ఆవిర్భావానికి ముందు అతడు ప్రారంభించిన ప్రాజెక్టు.. చివరకు జుకర్‌బర్గ్‌తో న్యాయపోరాటానికి దారితీసింది.

**హార్వర్డ్‌లో మొదలైన ఆలోచన**

అమెరికాలో స్థిరపడిన భారతీయ వైద్య దంపతుల కుమారుడైన దివ్య నరేంద్ర.. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకునే రోజుల్లోనే ఓ కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టాడు. 2002 డిసెంబరులో విద్యార్థులంతా ఆన్‌లైన్‌లో ఒకరితో ఒకరు అనుసంధానం అయ్యేలా ఓ సోషల్ నెట్‌వర్క్‌ను రూపొందించాలని భావించాడు. ఇందుకోసం హార్వర్డ్ విద్యార్థులైన కామెరాన్, టైలర్ వింక్లెవాస్ సోదరులతో కలిసి పనిచేశాడు. ఈ ప్రాజెక్టుకు తొలుత 'హార్వర్డ్ కనెక్షన్' అని పేరు పెట్టారు. ఆ తర్వాత 'కనెక్ట్‌యూ'గా మార్చారు. మొదట హార్వర్డ్‌లో ప్రారంభించి, క్రమంగా ఇతర విశ్వవిద్యాలయాలకూ విస్తరించాలన్నది వారి లక్ష్యం.

**ప్రాజెక్టులోకి జుకర్‌బర్గ్..**

వెబ్‌సైట్ అభివృద్ధి బాధ్యతలను తొలుత సంజయ్ మావింకుర్వేకు అప్పగించారు. ఆయన గూగుల్‌లో ఉద్యోగం రావడంతో ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత విక్టర్ గావో కొంత కోడింగ్ చేసినప్పటికీ, పనులు పూర్తికాలేదు. దీంతో 2003 నవంబరులో మార్క్ జుకర్‌బర్గ్‌ను సంప్రదించారు. అప్పటికే ప్రాజెక్టుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ వ్యవస్థ, డేటాబేస్, వెబ్‌పేజీలు, కోడింగ్ వంటి కీలక పనులు కొంతవరకు పూర్తయ్యాయి. ప్రాజెక్టు వివరాలు, కోడ్‌ను కూడా జుకర్‌బర్గ్‌తో పంచుకున్నారు. అయితే కొంతకాలానికే ఆయన సమావేశాలను వాయిదా వేస్తూ, సందేశాలకు స్పందించడం తగ్గించారని దివ్య, వింక్లెవాస్ సోదరులు ఆరోపించారు.

**ఫేస్‌బుక్ ఆవిర్భావం.. వివాదం**

2004 జనవరి 11న జుకర్‌బర్గ్ 'ది ఫేస్‌బుక్' డొమైన్‌ను నమోదు చేశారు. అదే ఏడాది ఫిబ్రవరి 4న హార్వర్డ్‌లో ఫేస్‌బుక్‌ను ప్రారంభించారు. రెండు రోజుల తర్వాత కొత్త సోషల్ నెట్‌వర్క్ గురించి విద్యార్థుల చర్చలతో ఈ విషయం దివ్య నరేంద్ర దృష్టికి వచ్చింది. తమ ఆలోచనను జుకర్‌బర్గ్ ఉపయోగించుకున్నారని దివ్య, వింక్లెవాస్ సోదరులు ఆరోపించారు. తొలుత హార్వర్డ్ యాజమాన్యాన్ని ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. అయితే తమ కోడ్‌ను ఫేస్‌బుక్‌లో ఉపయోగించలేదని జ్గుర్‌బర్గ్ వాదించారు.

**రూ.300 కోట్లతో రాజీ**

ఏళ్ల తరబడి సాగిన ఈ న్యాయపోరాటం చివరకు కోర్టు బయట ఒప్పందంతో ముగిసింది. ఈ సెటిల్‌మెంట్ విలువ 6.5 కోట్ల డాలర్లుగా (సుమారు రూ.300 కోట్లకు పైగా అప్పటి మారకపు విలువ ప్రకారం) వెల్లడైంది. ఇందులో దివ్యకు కొంతమేర ఫేస్‌బుక్ షేర్లు కూడా లభించినట్లు సమాచారం. ఆ తర్వాత ఆయన న్యాయ, వ్యాపార విద్యపై దృష్టి సారించారు. పెట్టుబడుల రంగానికి సంబంధించిన సోషల్ నెట్‌వర్క్ 'సమ్‌జీరో'ను సహవ్యవస్థాపకుడిగా ప్రారంభించారు. ఫేస్‌బుక్ ఆవిర్భావ కథ ఆధారంగా 2010లో వచ్చిన 'ది సోషల్ నెట్‌వర్క్' సినిమాలోనూ దివ్య పాత్రకు చోటు దక్కింది. ఆ పాత్రను నటుడు మ్యాక్స్ మింగెల్లా పోషించారు.

# అమెరికాలో గ్రీన్ కార్డ్ ఇక మరింత ప్రియం..

## ఇన్వెస్టర్ వీసా ఫీజులు రెట్టింపు.. భారతీయులపై ప్రభావం!




అమెరికాలో పెట్టుబడులు పెట్టి, శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) పొందాలనుకునే విదేశీయులకు, ముఖ్యంగా భారతీయులకు ఇది కీలకమైన పరిణామం. భారతీయ పారిశ్రామికవేత్తలు, కుటుంబాలు ఎక్కువగా ఆసక్తి చూపే ఈబీ-5 ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ ఫీజులను భారీగా పెంచుతూ అమెరికా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త ఫీజుల నిబంధనను యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) మంగళవారం ఖరారు చేసింది. నూతన ఫీజులు ఈ ఏడాది నవంబర్ 30 నుంచి అమల్లోకి రానున్నాయి.

**ఏమిటీ ఈబీ-5 ప్రోగ్రామ్?**

అమెరికాలో పెట్టుబడులు పెట్టడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, అమెరికన్లకు ఉద్యోగాలు కల్పించడం లక్ష్యంగా 1990లో ఈబీ-5 ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ పథకం కింద విదేశీ పెట్టుబడిదారులు అమెరికాలోని వాణిజ్య సంస్థలలో నిర్దిష్ట మొత్తంలో పెట్టుబడి పెట్టి, కనీసం 10 మంది అమెరికన్లకు పూర్తికాల ఉద్యోగాలు కల్పించాలి.

ప్రస్తుతం ఈ పెట్టుబడి మొత్తం అర్హత కలిగిన వ్యాపారంలో 1.05 మిలియన్ డాలర్లుగా, టార్గెటెడ్ ఎంప్లాయ్‌మెంట్ ఏరియా లేదా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులలో అయితే 8 లక్షల డాలర్లుగా ఉంది. ఈ నిబంధనలు పాటిస్తే, పెట్టుబడిదారుడు, వారి జీవిత భాగస్వామి, అర్హులైన పిల్లలు గ్రీన్ కార్డ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

**భారీగా పెరిగిన ఫీజులు ఇవే..**

యూఎస్‌సీఐఎస్ తాజా నిర్ణయంతో దరఖాస్తు ఫీజులు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగాయి. ప్రధాన మార్పులు ఇలా ఉన్నాయి:

సాధారణ ఇన్వెస్టర్లు దాఖలు చేసే ఫారం I-526 ఫైలింగ్ ఫీజు 3,675 డాలర్ల నుంచి 7,615 డాలర్లకు పెరిగింది

రీజనల్ సెంటర్ల ద్వారా పెట్టుబడి పెట్టేవారు ఉపయోగించే ఫారం ×-526ఇ ఫీజు 3,675 డాలర్ల నుంచి 7,850 డాలర్లకు చేరింది. ఈ రెండు ఫారాలకు అదనంగా 75 డాలర్ల టెక్నాలజీ ఫీజు చెల్లించాలి.

గ్రీన్ కార్డ్‌పై ఉన్న షరతులను తొలగించుకోవడానికి దాఖలు చేసే ఫారం I-829 ఫీజు 3,750 డాలర్ల నుంచి 5,000 డాలర్లకు పెరిగింది.

రీజనల్ సెంటర్ల కోసం దరఖాస్తు చేసుకునే ఫారం I-956 ఫీజు 17,795 డాలర్ల నుంచి ఏకంగా 44,115 డాలర్లకు పెరిగింది.

పెట్టుబడి ప్రాజెక్టు ఆమోదం కోసం ఉపయోగించే ఫారం I-956ఫ్ ఫీజు 17,795 డాలర్ల నుంచి 42,675 డాలర్లకు పెరిగింది. అయితే, ఫారం I-956+ వార్షిక ఫీజును 3,035 డాలర్ల నుంచి 2,165 డాలర్లకు తగ్గించడం గమనార్హం.

**ఫీజుల పెంపునకు కారణమిదే..!**

ఫీజుల పెంపుపై యూఎస్‌సీఐఎస్ ఒక ప్రకటనలో వివరణ ఇచ్చింది. తమ ఏజెన్సీకి ప్రభుత్వ పన్నుల ద్వారా కాకుండా, దరఖాస్తుదారులు చెల్లించే ఫీజుల ద్వారానే అధికశాతం నిధులు సమకూరుతాయని స్పష్టం చేసింది. దరఖాస్తుల సమీక్ష, నేపథ్య పరిశీలన, అర్హత నిర్ధారణ, మోసాల గుర్తింపు, కార్యక్రమ నిర్వహణ వంటి ఖర్చులను భరించేందుకే ఈ పెంపు తప్పనిసరైందని తెలిపింది.

**భారతీయులపై ఎఫెక్ట్**

గత దశాబ్దకాలంగా భారత్ నుంచి ఈబీ-5 వీసాలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీంతో దరఖాస్తుల సంఖ్య పెరిగి, గ్రీన్ కార్డ్ కోసం వేచి చూసే సమయం కూడా ఎక్కువైంది. తాజా ఫీజుల పెంపుతో ఈ మార్గంలో అమెరికా వెళ్లాలనుకునే భారతీయ పెట్టుబడిదారులపై అదనపు ఆర్థిక భారం పడనుంది

## ఏటీఎం లావాదేవీల నుంచి ఎల్పీజీ సబ్సిడీ వరకు..

# అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్

**అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్న పలు ఆర్థిక మార్పులు**

**రూ.2000 దాటిన వ్యాపార యూపీఐ లావాదేవీలపై కొత్త ఫ్రేమ్‌వర్క్**

**సబ్సిడీ ఎల్పీజీ సిలిండర్ కోసం బయోమెట్రిక్ ఆధార్ తప్పనిసరి**

**ఎస్‌బీఐ శాలరీ ఖాతాదారులకు ఏటీఎం ఉచిత లావాదేవీల పరిమితిలో కోత**

**పన్ను చెల్లింపుదారులకు గడువు పొడిగించిన సీబీడీటీ**



**సెప్టెంబర్ 30(ప్రజావినికిడి):** అక్టోబర్ నెల గురువారం నుంచి ప్రారంభం కానుండగా, సామాన్యుల ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపే పలు కీలక నిబంధనలు అమల్లోకి రానున్నాయి. బ్యాంకింగ్, పన్నులు, పొదుపు పథకాలు, వంటగ్యాస్ వంటి అనేక రంగాల్లో ఈ మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులు, పన్ను చెల్లింపుదారులు ఈ కొత్త నియమాలపై అవగాహన కలిగి ఉండటం చాలా అవసరం.

**యూపీఐ, పన్నుల విధానాల్లో మార్పులు**

ఈ మార్పులలో ముఖ్యంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)కి సంబంధించి కొత్త నిబంధన అమల్లోకి వస్తోంది. రూ.2,000 మించిన వ్యాపార (మర్చంట్) లావాదేవీలపై కొత్త 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) ఫ్రేమ్‌వర్క్‌ను వర్తింపజేయనున్నారు. అయితే, ఈ ఛార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేయబోరని, వ్యక్తిగత లావాదేవీలు యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని స్పష్టతనిచ్చారు. మరోవైపు, పన్ను చెల్లింపుదారులకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఊరట కల్పించింది. 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి గాను, ట్యాక్స్ ఆడిట్ రిపోర్ట్ దాఖలు గడువును అక్టోబర్ 21కి, ఆదాయపు పన్ను రిటర్నుల (ఐటీఆర్) ఫైలింగ్ గడువును నవంబర్ 21కి పొడిగించింది.

**ఎల్పీజీ, ఎస్‌బీఐ ఏటీఎం నిబంధనలు**

గృహ వినియోగదారులకు సంబంధించి ఎల్పీజీ సిలిండర్ బుకింగ్‌లో కీలక మార్పు రాబోతోంది. అక్టోబర్ 1 నుంచి సబ్సిడీ ధరపై గ్యాస్ సిలిండర్ పొందాలంటే తప్పనిసరిగా బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ పూర్తి చేయాలి. ఈ ప్రక్రియ పూర్తి చేయని వారు మార్కెట్ ధరకు సిలిండర్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కూడా తన నిబంధనలను సవరించింది. శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో అందించే నెలవారీ ఉచిత లావాదేవీల సంఖ్యను 10 నుంచి 5కి తగ్గించింది. ఈ పరిమితి ఆర్థిక, ఆర్థికేతర లావాదేవీలు రెండింటికీ వర్తిస్తుంది. 'బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్' (బీఎస్‌బీడీ) ఖాతాలకు నెలకు నాలుగు ఉచిత నగదు విత్‌డ్రాలు కొనసాగుతాయి. ఆ తర్వాత చేసే ప్రతి విత్‌డ్రాపై రూ.15తో పాటు జీఎస్టీ విధిస్తారు.

**ఇతర కీలక మార్పులు**

వీటితో పాటు, ప్రవాస భారతీయుల నుంచి ఆస్తులు కొనుగోలు చేసేవారు టీడీఎస్ కోసం ప్రత్యేకంగా టాన్ బదులు పాన్ ఉపయోగించుకోవచ్చు. 'నేషనల్ పెన్షన్ సిస్టమ్' (ఎన్‌పీఎస్)లో కొత్తగా చేరేవారికి రూ.200 ఆన్‌బోర్డింగ్ ఛార్జీ అమల్లోకి వస్తుంది. కాగా, ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం అక్టోబర్ 5 నుంచి 7 వరకు జరగనుంది. వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని అక్టోబర్ 7న ప్రకటించనున్నారు. గత సమావేశంలో రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా ఉంచిన విషయం తెలిసిందే.

### సత్య, యోగి బాబుల సినిమాకు టైటిల్ ఖరారు..

# 'గోల్డెన్ భాగ్యం'!




తెలుగు చిత్రసీమకు చెందిన ప్రముఖ హాస్య నటుడు సత్య, తమిళ స్టార్ కమెడియన్ యోగి బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ద్విభాషా చిత్రానికి టైటిల్ ఖరారైంది. ఈ సినిమాకు 'గోల్డెన్ భాగ్యం' అనే పేరును ఖరారు చేస్తూ చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. పవన్ బసమ్శెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందిస్తున్నారు.

ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ రివీల్ గ్లింప్స్ వీడియో ఆకట్టుకుంటోంది. బిర్యానీ, ఇడ్లీలలో ఏది గొప్పదనే అంశంపై తెలుగు, తమిళ వ్యక్తుల మధ్య జరిగే సరదా సంభాషణతో ఈ వీడియో ప్రారంభమవుతుంది. అనంతరం సంప్రదాయ దుస్తుల్లో ఉన్న సత్య, యోగి బాబులను పరిచయం చేశారు. ఈ గ్లింప్స్‌లో సత్య తమిళంలో, యోగి బాబు తెలుగులో సంభాషించడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇది ప్రేమ, నేరం (క్రైమ్), యాక్షన్ కలగలిసిన పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమని మేకర్స్ వెల్లడించారు.డ్రీమ్ మూవీ మేకర్స్, నయవాయు చిత్రాల పతాకాలపై నాగార్జున రెడ్డి, పవన్ బసమ్శెట్టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో జయశ్రీ, అతిరాజ్ కథానాయికలుగా నటిస్తుండగా.. వెన్నెల కిశోర్, సుదర్శన్, కిశోర్ తిరుమల, రోహిణి, తనికెళ్ల భరణి, సునీల్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాబ్లు అజు ఛాయాగ్రహణం అందిస్తుండగా, పవన్ సీహెచ్ సంగీతం సమకూరుస్తున్నారు. ఈ ఏడాదిలోనే ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

### ముంబై 26/11 దాడుల హీరో కథ..

# ఉత్కంఠ రేపుతున్న 'ప్రహార్' ట్రైలర్

బాలీవుడ్ నటుడు రాజ్ కుమార్ రావు ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ప్రహార్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఉజ్వల్ నికమ్'. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ముంబై ఉగ్రదాడుల నేపథ్యంలో వస్తున్న ఈ సినిమా అధికారిక ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ప్రస్తుతం ఈ ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.దేశం గర్వించదగ్గ పబ్లిక్ ప్రాసిక్యూటర్లలో ఒకరైన ఉజ్వల్ నికమ్ జీవిత కథ ఆధారంగా ఈ బయోపిక్ తెరకెక్కుతోంది. ముఖ్యంగా 26/11 ముంబై దాడి కేసులో ఉగ్రవాది అజ్మల్ కసబ్‌కు వ్యతిరేకంగా ఆయన చేసిన వాదనలు, కోర్టు రూమ్‌లో జరిగిన నాటకీయ పరిణామాలు, ఆయన వ్యక్తిగత జీవితంలోని కొన్ని అంశాలను ఈ చిత్రంలో చూపించనున్నారు.ఉజ్వల్ నికమ్ పాత్రలో రాజ్ కుమార్ రావు తన అద్భుతమైన నటనతో ఆకట్టుకోనున్నారు. ఈ చిత్రంలో ఆయన సరసన వామికా గబ్బి నటిస్తుండగా.. జైదీప్ అహ్లావత్, సికందర్ ఖేర్ వంటి నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అవినాష్ అరుణ్ ధవారే దర్శకత్వం వహిస్తుండగా, మ్యాడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌పై దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 16, 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.




# మొత్తం చిత్ర పరిశ్రమను నిందించకూడదు : అమలా పాల్



సినిమాల్లో కొందరు హీరోయిన్లను అభ్యంతరకరంగా చూపించడానికి మొత్తం చిత్ర పరిశ్రమను నిందించడం సరికాదని, అది ఆయా చిత్రాల దర్శకుడు లేదా టీమ్ ఆలోచనా విధానంపై ఆధారపడి ఉంటుందని ప్రముఖ నటి అమలా పాల్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని, మహిళా ప్రాధాన్య చిత్రాలు ఎక్కువగా వస్తుండటం శుభపరిణామమని ఆమె పేర్కొన్నారు.కొచ్చిలో జరిగిన 'ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్ 2026'లో అమలా పాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణాది సినిమాల్లో హీరోయిన్ల పాత్రల చిత్రీకరణపై వస్తున్న విమర్శలపై స్పందించారు. "ప్రతి పరిశ్రమ నుంచి మంచి మహిళా ప్రాధాన్య చిత్రాలు వస్తున్నాయి. కాబట్టి మొత్తం పరిశ్రమను నిందించదలుచుకోలేదు. సమస్య ఏదైనా ఉంటే అది ఒక సినిమాకు లేదా దర్శకుడి ఆలోచనా విధానానికే పరిమితమై ఉంటుంది," అని ఆమె వివరించారు.

15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న తాను ఎప్పుడూ మూస పాత్రలకు భిన్నంగా, ప్రత్యేకమైన పాత్రలనే ఎంచుకున్నానని అమలా పాల్ తెలిపారు. ఇందులో భాగంగానే 2019లో 'ఆడై' (తెలుగులో 'ఆమె') లాంటి సాహసోపేతమైన చిత్రంలో నటించానని గుర్తుచేసుకున్నారు. "ఆ సమయంలో నా ఇమేజ్ ఏమవుతుందోనని, అలాంటి పాత్రలే మళ్లీ వస్తాయేమోనని భయపడ్డాను. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అది చాలా ధైర్యమైన నిర్ణయంగా అనిపిస్తోంది. కానీ, ఇప్పుడు నన్ను 'ఆడై' లాంటి సినిమా చేయమంటే బహుశా చేయలేకపోవచ్చు," అని ఆమె స్పష్టం చేశారు. మహిళలు తమ స్థానం కోసం కష్టపడుతున్నారని, రానున్న రోజుల్లో మరింత సానుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# తారక్‌ను 'జెన్‌జీ ఎన్టీఆర్' అన్న రాఘవేంద్రరావు



ఫహద్ ఫాజిల్ హీరోగా నటించిన 'డోంట్ ట్రబుల్ ద ట్రబుల్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రముఖ దర్శకులు కె. రాఘవేంద్రరావు చేసిన సరదా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వ్యాఖ్యలకు యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ చిరునవ్వుతో ఇచ్చిన హుందా స్పందన అందరినీ ఆకట్టుకుంటోంది.



ఎస్ఎస్ రాజమౌళి సమర్పణలో, శశాంక్ వెన్నెలకంటి దర్శకత్వంలో వస్తున్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్ సినిమా అక్టోబర్ 2న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో జరిగిన వేడుకకు జూనియర్ ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు తన ప్రసంగాన్ని 'జై ఎన్టీఆర్' అనే నినాదంతో ప్రారంభించి అందరిలో ఉత్సాహం నింపారు.వెంటనే స్పందిస్తూ, "జై ఎన్టీఆర్ అంటే ఇక్కడ కూర్చున్న అబ్బాయి కాదు, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు" అని స్పష్టం చేశారు. "ఆయన సీనియర్ ఎన్టీఆర్. ఆయన తనయుడు హరికృష్ణ. ఆయన కుమారుడు ఇక్కడున్న మన జూనియర్ ఎన్టీఆర్. ఈయన జెన్‌జీ ఎన్టీఆర్" అని చమత్కరించారు.రాఘవేంద్రరావు వ్యాఖ్యలకు జూనియర్ ఎన్టీఆర్ వేదికపై చిరునవ్వుతో కనిపించగా, పక్కనే ఉన్న రాజమౌళి కూడా నవ్వారు. ముఖ్యంగా సీనియర్ ఎన్టీఆర్ పేరు ప్రస్తావించినప్పుడు తారక్ చూపిన గౌరవం, ప్రశాంతమైన స్పందనను అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసిస్తున్నారు. ఈ సరదా సంభాషణకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# పట్టు వదలని నాని..



ప్యారడైజ్'కు రిలీజ్ రోజు నుంచే మిక్స్‌డ్ టాక్ వచ్చింది. ఈ విషయాన్ని నాని కూడా దాచిపెట్టలేదు. సినిమా అందరికీ ఒకేలా కనెక్ట్ కాలేదని ఆయన ఓపెన్‌గానే మాట్లాడారు. సాధారణంగా ఇలాంటి టాక్ వచ్చిన తర్వాత హీరోలు ప్రమోషన్స్ తగ్గించి నెక్స్ట్ పనుల్లోకి వెళ్లిపోతారు. కానీ నాని మాత్రం అలా చేయడం లేదు. సినిమా థియేటర్లలో ఉన్నంత వరకు తనవంతుగా ఎంత చేయాలో అంత చేయాలనే మూడ్‌లో కనిపిస్తున్నారు. తెలంగాణలో ప్రమోషన్స్ చేసిన తర్వాత ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ వరుసగా తిరుగుతున్నారు. విజయవాడలో కనకదుర్గమ్మ ఆలయాన్ని దర్శించుకోవడంతో పాటు, ఒంగోలులోని థియేటర్‌కు వెళ్లి ఆడియన్స్‌ను కలవనున్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వచ్చిన విజువల్స్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అంటే సినిమా మీద టాక్ ఎలా ఉన్నా, పబ్లిక్‌లో 'ది ప్యారడైజ్' పేరు తగ్గకుండా చూసే ప్రయత్నం మాత్రం నాని వైపు నుంచి గట్టిగానే జరుగుతోంది. మొదటి వీకెండ్ వరకు కలెక్షన్స్ కూడా పూర్తిగా పడిపోలేదు. ఓపెనింగ్స్‌కు నాని మార్కెట్, భారీ ప్రమోషన్, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ బాగా ఉపయోగపడ్డాయి. అయితే వీకెండ్ తర్వాతే అసలు లెక్క మొదలవుతుంది. మిక్స్‌డ్ టాక్ ఉన్న సినిమాలకు సోమవారం నుంచి డ్రాప్స్ ఎలా ఉంటాయన్నదే కీలకం. అందుకే ఇప్పుడు టీమ్ కూడా ప్రమోషన్స్‌ను ఆపకుండా మరోసారి ఆడియన్స్‌ను థియేటర్ల వైపు తిప్పే ప్రయత్నం చేస్తోంది. దీనికి గాంధీ జయంతి కూడా కలిసి వస్తోంది. మధ్యలో హాలిడే ఉండటం, వెంటనే మరో వీకెండ్ రావడం 'ది ప్యారడైజ్'కు రెండో ఛాన్స్‌లా మారొచ్చు. మొదటి వీకెండ్‌లో చూడని ఆడియన్స్‌ను ఈ గ్యాప్‌లో థియేటర్లకు రప్పించగలిగితే కలెక్షన్స్ ఇంకొన్ని రోజులు నిలబడే అవకాశం ఉంటుంది. అందుకే నాని ఈ టైమ్‌లోనే ఆంధ్రా టూర్ పెట్టుకోవడం కూడా ప్లాన్డ్ మూవ్‌లానే కనిపిస్తోంది.

# బడ్జెట్ 30 కోట్ల లోపు .. వసూళ్లు 300 కోట్లకి పైన ..

## ఓటీటీకి మలయాళ మూవీ!

చాలా తక్కువ బడ్జెట్ లో రూపొందడం .. భారీ వసూళ్లను ఖాతాలో వేసుకోవడం మలయాళ సినిమాల విషయంలో జరుగుతూనే ఉంటుంది. క్రితం ఏడాదిలోను .. ఈ ఏడాది ఆరంభంలోను మలయాళంలో చిన్న సినిమాలు వసూళ్ల పరంగా కొత్త రికార్డులను సృష్టించాయి. మలయాళంతో పాటు ఇతర భాషల్లోను ఈ సినిమాలు భారీ విజయాలను నమోదు చేయడం విశేషం. అలాంటి సినిమాల జాబితాలో తాజాగా 'బెత్లెహెం కుటుంబ యూనిట్' సినిమా కనిపిస్తుంది. నివిన్ పౌలి – మమితా బైజు ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఆగస్టు 21వ తేదీన థియేటర్లకు వచ్చింది. టైటిల్ ను మార్చకుండా ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేయడం కూడా విశేషంగా చెప్పుకోవచ్చు. అయినా తెలుగు వైపు నుంచి కూడా ఈ సినిమాకి మంచి ఆదరణ లభించింది. దాదాపు 25 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మించారు. అలాంటి ఈ సినిమా 325 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టింది. ఒక చిన్న టౌన్ నేపథ్యంలో నడిచే సింపుల్ లవ్ స్టోరీ ఈ స్థాయి వసూళ్లు రావడం నిజంగా గొప్ప విషయమే.ఈ సినిమాలో హీరోకి పెళ్లీడు దాటిపోతుంది. అతను ఇక పెళ్లి విషయాన్ని పక్కన పెట్టేసి కేటరింగ్ బిజినెస్ చూసుకుంటూ ఉంటాడు. అలాంటి పరిస్థితులలో కొత్తగా ఆ ఊరు వచ్చిన హీరోయిన్ కి ఆయన కేరక్టర్ నచ్చుతుంది. తనకంటే అతను వయసులో చాలా పెద్దవాడైనప్పటికీ లవ్ చేయడం మొదలుపెడుతుంది. ఆ విషయం ఆమె ఇంట్లో తెలుస్తుంది. అప్పుడు ఏం జరుగుతుంది? అనేది కథ. అక్టోబర్ 2వ తేదీ నుంచి 'జియో హాట్ స్టార్'లో అందుబాటులోకి వస్తున్న ఈ సినిమాకి, ఓటీటీ వైపు నుంచి ఏ స్థాయి ఆదరణ లభిస్తుందనేది చూడాలి.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613